

జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem STRUGGLE FOR JUSTICE TV

సామాన్యుడి ఆయుధంగా



సంపుటి - 07 | సంచిక 354 | ఎడిటర్ : బరిగెల శివ | బుధవారం 25, నవంబర్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్

ఆత్మగౌరవమే.. ఆదర్శం

- ప్రజలను వేధిస్తూ బతకడం ఆత్మగౌరవం ఎలా అవుతుంది
- అకారణంగా ప్రజల ప్రాణాలు తీస్తుండడం ఎలాంటి ఆత్మగౌరవం
- కారణాలు లేకుండా ప్రజలను కష్టపెట్టడం ఆదర్శవంతమా!
- ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదు ప్రజాప్రతినిధులకు ఆత్మగౌరవం లేదు
- ప్రభుత్వ అధికారుల బరితెగింపు ప్రజాస్వామ్యానికి చాలా ప్రమాదం
- ప్రజలకు చిరకాలం
- గుర్తుండిపోయే వ్యక్తులే ఆత్మగౌరవం కలవారు
- దిక్కుమాలిన నడవడిక కలవారు ఆత్మగౌరవం కలిగిన వ్యక్తుల్లాగా ఫీల్ అవుతున్నారు
- ఆత్మగౌరవంతో బ్రతకడం నేటి దినాల్లో సాధ్యమేనా!
- అధికారులైన నాయకులైన చెప్పేది ఒకటి చేసేది మరొకటి అదేం ఆత్మగౌరవమో అంతుచిక్కడం లేదు
- ఆత్మగౌరవంతో బ్రతికే వాళ్ళు కఠినమైన నిందలు మోయల్సి వస్తుంది
- డాక్టర్ బరిగెల శివ

ఆత్మగౌరవం అనేది ప్రతి మనిషి వ్యక్తిత్వానికి నిలువుటద్దం.. సమాజంలో అతడి నడవడికకు అసలైన కొలమానం. అధికార అహంకారంతో ప్రజలను వేధిస్తూ, ప్రశ్నించే గొంతులను అణచివేస్తూ ఆత్మగౌరవం ఉందంటే ఎలా? ప్రజాసేవ పేరుతో పదవులు అనుభవిస్తూ వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాలకు పెద్దపీట వేస్తున్న నాయకులెందరో పార్టీలు మారుతూ, రాజకీయ పబ్బం గడుపుకుంటూ ప్రజల ముందు నీతులు వల్లించడం విడ్డూరంగా మారుతోంది. అక్రమ సంపాదనతో అధికారాలను శాసిస్తూ నిజాయితీపరులను అవమానించే సంస్కృతి పెరిగిపోతోంది. ప్రభుత్వాలను ప్రశ్నించే ప్రజాసంఘాలు, ఉద్యమకారులు, మేధావులపై దాడులకు దిగడం ప్రజాస్వామ్యానికే ప్రమాదకరం. మాటల్లో నీతి, చేతల్లో అవినీతి ప్రదర్శించే నాయకులు, అధికారులు ఆత్మగౌరవానికి అసలైన అర్థాన్ని మరిచిపోతున్నారు. నిజాయితీగా జీవిస్తూ సమాజానికి మేలు చేసేవారు మాత్రం అనేక అవమానాలు, అవరోధాలు ఎదుర్కోవాల్సి వస్తోంది. ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయే సేవా గుణం, నిబద్ధత, నిష్పక్షపాతమే వ్యక్తికి నిజమైన గౌరవాన్ని తెచ్చిపెడతాయి. అధికారంతో కాదు.. ఆత్మగౌరవంతో బతికేవారే ఆదర్శవంతులని డాక్టర్ బరిగెల శివ స్పష్టం చేస్తున్నారు. - హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

2



ఆత్మగౌరవంతో బ్రతికే వాళ్ళు ఆదర్శవంతులు

వైద్య "పీజీ"అభ్యర్థులకు తీరని అన్యాయం

- నేషనల్ కోటాలో సీట్లు పొందుకున్న విద్యార్థులకు అడ్డుపడుతున్నారు
- నీట్ పీజీ కౌన్సెలింగ్‌లో సీట్ల బ్లాకింగ్ కలకలం
- కేఎన్ఆర్‌యూహెచ్ఎస్ తీరుపై అభ్యర్థుల ఆగ్రహం
- కౌన్సెలింగ్ గడువులపై అభ్యంతరాలు
- సీట్ల నిలుపుదలతో మెరిట్ అభ్యర్థులకు అన్యాయం జరుగుతోందని ఆవేదన
- ఒరిజినల్ సర్టిఫికెట్స్ ఇవ్వకుండా అడ్డుపడుతున్నారు
- జోక్యం చేసుకోవాలని ఐఎంఏ-ఎంఎస్ఎన్ టీజీకి విజ్ఞప్తి



4



ఎస్సీ సంక్షేమ శాఖ బాలికల హాస్టల్ మార్పుపై విద్యార్థినుల ఆందోళన!

- దిల్‌సుఖ్‌నగర్‌లోనే కొనసాగించాలని 87 మంది విద్యార్థినుల విజ్ఞప్తి..
- సోషల్ వెల్ఫేర్ డీడీ ప్రత్యేక చొరవ తీసుకోవాలి..
- మంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లి న్యాయం చేయాలి: డాక్టర్ బరిగెల శివ

3

తెలంగాణ మహిళలకు చిలకపచ్చ చీరలు..

ఈ నెల 26న ప్రారంభించనున్న రేవంత్ రెడ్డి

- నవంబర్ 26న తెలంగాణలో ప్రారంభం కానున్న ఇందిరమ్మ చీరల పంపిణీ
- నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో పథకాన్ని ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి
- రేషన్ కార్డు కలిగిన 18 ఏళ్లు పైబడిన కోటి మంది మహిళలకు లబ్ధి

వివరాలు 2లో

కేయూలో.. 'పార్ట్ టైం' వీసి





- సమయపాలన లోపంతో కేయూ పరిస్థితి అస్తవ్యస్తం.
- అధికార హోదాకు తగిన న్యాయం జరగడం లేదు.
- పార్ట్ టైం వీసి పార్ట్ టైం అధ్యాపకుల జీవితాలను నాశనం చేస్తున్నాడు.
- పార్ట్ టైం అధ్యాపకులపై కక్షపెంచుకున్నారు.
- అర్థం పర్థం లేని సమాధానాలతో వేధిస్తున్నాడు.
- వీసీ ఛాంబర్ డోర్ మూసివేసుకుంటున్నారు.
- వీసీ చాంబర్ గ్రిల్స్ ను మూసి వేస్తూ ఉద్యోగులతో బెదిరింపులకు పాల్పడుతున్నారు.
- నన్ను కలవద్దు రిజిస్ట్రార్ ను కలవండి అంటూ దాటవేస్తున్నారు.
- నాకేం సంబంధం లేదు అంతా వీసికె తెలుసు అంటూ కరాకండిగా మాట్లాడుతున్న రిజిస్ట్రార్ వి. రామచంద్రం.
- గిట్లయితే కేయూలో ఏ వర్గానికి న్యాయం జరుగుతుందో అధికారులే చెప్పాలి

3

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE సమస్యలపై సమరంగా Jai Bheem TV సామాన్యుడి ఆయుధంగా

తెలంగాణ మహిళలకు చిలకపచ్చ చీరలు..

ఈ నెల 26న ప్రారంభించనున్న రేవంత్ రెడ్డి

నవంబర్ 26న తెలంగాణలో ప్రారంభం కానున్న ఇందిరమ్మ చీరల పంపిణీ

నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో పథకాన్ని ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి

రేషన్ కార్డు కలిగిన 18 ఏళ్లు పైబడిన కోటి మంది మహిళలకు లబ్ధి

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన మహిళలకు 'ఇందిరమ్మ చీరల' పంపిణీ చేపట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. రాజ్యాంగ దినోత్సవమైన నవంబర్ 26న నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. 'ఇందిరా మహిళా శక్తి' పథకంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు కోటి మంది మహిళలకు రామచిలుక రంగు (ప్యారెట్ గ్రీన్) చీరలను అందించనున్నారు. ఆహార భద్రత లేదా రేషన్ కార్డు కలిగిన కుటుంబాల్లోని 18 ఏళ్లకు పైబడిన మహిళలను ఈ పథకానికి లబ్ధిదారులుగా ప్రభుత్వం ఎంపిక చేసింది. ఇందులో గ్రామీణ ప్రాంతాలకు చెందిన 65 లక్షల మంది, పట్టణ ప్రాంతాలకు చెందిన 35 లక్షల మంది మహిళలు ఉన్నారు. మొత్తం కోటి చీరల్లో 6.30 మీటర్ల పొడవు కలిగిన పాలిస్టర్ చీరలు 95 లక్షలు కాగా, 9 మీటర్ల పొడవు ఉండే పాలీ-కాటన్ చీరలు 5 లక్షలు ఉన్నాయి. స్థానిక చేనేత రంగాన్ని ప్రోత్సహించడంతో పాటు సిరిసిల్ల తదితర ప్రాంతాల్లోని నేత కార్మికులకు చేతినిండా పని కల్పించే ఉద్దేశంతో ఈ చీరల తయారీ బాధ్యతలను వారికి అప్పగించారు. ఈ పంపిణీ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రత్యేక మొబైల్ యాప్‌ను వినియోగిస్తున్నారు. అర్హులైన మహిళలు తమ గ్రామాలు, వార్డుల్లోని పంపిణీ కేంద్రాల వద్ద రేషన్ కార్డు, ఆధార్ వివరాలను సమర్పించి చీరలను తీసుకోవచ్చు. వాస్తవానికి ఈ కార్యక్రమాన్ని నవంబర్ 19న ప్రారంభించాలని తొలుత నిర్ణయించినప్పటికీ, అనివార్య కారణాలతో నవంబర్ 26కు రీషెడ్యూల్ చేశారు. జిల్లా కలెక్టర్లు, జిల్లాల ఇన్‌ఛార్జ్ మంత్రుల పర్యవేక్షణలో ఈ పంపిణీ ప్రక్రియ రాష్ట్రవ్యాప్తంగా కొనసాగనుంది.

మృతుల కుటుంబాలకు పరామర్శ

అనారోగ్య బాధితులకు భరోసా కల్పించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు





హసన్‌పర్తి, 24 నవంబర్ 2026 (జై భీమ్ న్యూస్)

ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ, ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడమే తన బాధ్యత అని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 66వ డివిజన్ హసన్‌పర్తి గ్రామానికి చెందిన బోడ కిషోర్, జన్ను రవీందర్, బొమ్మరాజు కుమారస్వామి, మేకల కనకలక్ష్మి, తాళ్ల శ్రీనివాస్, హోంగార్డు రవి భార్య కాలే సరోజన, వల్లాల లక్ష్మి ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పరామర్శించారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, వారి దుఃఖంలో పాలుపంచుకున్నారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న జన్ను రమేష్, జన్ను ఎల్లమ్మ, వీరస్వామి కుటుంబాలను సందర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారికి మనోధైర్యం కల్పిస్తూ, అవసరమైన సమయంలో అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను తెలుసుకోవడం, కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవడం తన బాధ్యతగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో 66వ డివిజన్ అధ్యక్షులు గొర్రె కిరణ్, 65వ డివిజన్ అధ్యక్షులు నేదునూరి సునీల్, హసన్‌పర్తి మహిళా మండల అధ్యక్షురాలు జోరుకపూల, మల్లారెడ్డిపల్లి పీఏసీఎస్ చైర్మన్ కుమారస్వామి, సీనియర్ నాయకులు ఎల్ఐసీ వెంకటేశ్వర్లు, కనపర్తి కిరణ్, విసం సురేందర్ రెడ్డి, ఐలయ్య, పుల్ల రవీందర్, జన్మ రవీందర్, ఆరెల్లి వెంకటస్వామి, చిర్ర విజయ్, కూకుట్ల రమేష్, రామంచ దయాకర్, గరిగె రాజు, మేకల ఆనంద్, బిగుళ్ల సురేష్, దూడల ప్రకాష్, మైకేల్, జన్మ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు ప్రాజెక్టుపై రేవంత్ రెడ్డి చెబుతున్నది పచ్చి అబద్ధం

హైదరాబాద్, నవంబర్ 24 (జై భీమ్ న్యూస్) :

పల్నాడు ప్రాజెక్టుపై రేవంత్ రెడ్డి చెబుతున్నది పచ్చి అబద్ధం. 2022లో ఏపీ ఇచ్చిన జీవో 56లో నాగార్జున సాగర్ నుంచి నీళ్లు తీసుకుంటామని, ఎంత నీరు తీసుకుంటామనే ప్రస్తావనే లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. మంగళవారం అయన మీడియాతో మాట్లాడారు. ఆ జీవోను చూపించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. రేవంత్ సీఎం అయ్యాక ఈ ఏడాది జనవరిలో పల్నాడు ప్రాజెక్టుకు టెండర్లు.. ఏప్రిల్‌లో నాగార్జున సాగర్ నుంచి నీళ్లు తీసుకునేందుకు ఏపీ మరో జీవో! కేటీఆర్, బీఆర్ఎస్ నేతలు విషయం బయటపెట్టాకే మీరు బ్యాక్‌డేట్‌లో ఉత్తరం రాశారు కదా. ఉమ్మడి రాష్ట్రంలో కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలు చాలని ఒప్పుకున్నది మీరే.. ఆనాడు సంతకాలు చేసింది ఇప్పుడు రేవంత్ రెడ్డి పక్కన ఉన్న మంత్రులే. తెలంగాణ ఏర్పడిన 42 రోజులకే కేసీఆర్ ఢిల్లీకి వెళ్లి 299 టీఎంసీలు కాకుండా 580 టీఎంసీల నీళ్లు కావాలని ఫిర్యాదు చేశారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరిగిందంటే అందుకు బాధ్యత మీదే కదా అని అన్నారు.

ఆత్మగౌరవమే.. ఆదర్శం

ఆత్మగౌరవంతో బ్రతికే వాళ్ళు ఆదర్శవంతులు

ప్రజలను వేధిస్తూ బతకడం ఆత్మగౌరవం ఎలా అవుతుంది

అకారణంగా ప్రజల ప్రాణాలు తీస్తుండడం ఎలాంటి ఆత్మగౌరవం

కారణాలు లేకుండా ప్రజలను కష్టపెట్టడం ఆదర్శవంతమా!

ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదు ప్రజాప్రతినిధులకు ఆత్మగౌరవం లేదు

ప్రభుత్వ అధికారుల బరితెగింపు ప్రజాస్వామ్యానికి చాలా ప్రమాదం

ప్రజలకు చిరకాలం గుర్తుండిపోయే వ్యక్తులే ఆత్మగౌరవం కలవారు

దిక్కుమాలిన నడవడిక కలవారు ఆత్మగౌరవం కలిగిన వ్యక్తుల్లాగా ఫీల్ అవుతున్నారు

ఆత్మగౌరవంతో బ్రతకడం నేటి దినాల్లో సాధ్యమేనా!

అధికారులైన నాయకులైన చెప్పేది ఒకటి చేసేది మరొకటి అదేం ఆత్మగౌరవమో అంతుచిక్కడం లేదు

ఆత్మగౌరవంతో బ్రతికే వాళ్ళు కలినమైన నిందలు మోయల్సి వస్తుంది

డాక్టర్ బరిగెల శివ

హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

అధికార అహంకారం మనిషి పొగరుబోతు తనానికి నిదర్శనమని డాక్టర్ బరిగెల శివ అభిప్రాయపడ్డారు. సాధారణ ప్రజలకు చేయూతనిస్తున్న ప్రతి ఒక్కరు ఆత్మగౌరవంతో బ్రతుకుతున్నారని గుర్తించాలన్నారు. ప్రజల మనోభావాలను అర్థం చేసుకొని వాళ్లకు సహాయం చేయగల ధైర్యవంతులు సాహసవంతులు కనికరవంతులు భారతదేశంలో చాలా తక్కువగా ఉన్నారని అలాంటి వాళ్లను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజాస్వామ్యవాదులదే,, ప్రజా సంఘాలదెనంటూ తెలియజేశారు. దేశంలో కొన్ని రాజకీయ పార్టీలు అధికారాన్ని అనుభవించడం కోసమే తాపత్రయపడుతున్నాయని అలాంటి ప్రభుత్వాలు ఆత్మ గౌరవాన్ని అమ్ముకొని జీవిస్తూ ఆదర్శవంతమైన సమాజాన్ని నాశనం చేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజల జీవన విధానంపై దెబ్బ కొడుతున్న ప్రజాప్రతినిధులు ఆత్మగౌరవంపై ప్రమాణం చేస్తూ జీవిస్తుండడం తమ వ్యక్తిగత ఆత్మ గౌరవాన్ని మోసం చేసుకోవడంతో పాటు ప్రజలకు ఏ విధమైనటువంటి సహాయాన్ని అందించలేరనేది స్పష్టంగా తేలిపోతుందన్నారు. దేశంలో ఎక్కడ చూసినా రాజకీయ నాయకుల హవా కొనసాగుతుందని ప్రజల తరఫున నిలబడాల్సిన ప్రజాప్రతినిధులు ఆత్మగౌరవం సాక్షిగా ప్రజలను మోసం చేస్తున్నారన్నది జగమెరిగిన సత్యం అన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పైస సంపాదనపై పెద్ద ఎత్తున మమకారాన్ని పెంచుకొని ప్రజల మధ్యలో జీవిస్తూ ప్రజాసేవను విస్మరిస్తూ కొంతమంది అనుచరులతోవాడిని గొప్పవాళ్ళుగా ప్రచారం చేయించుకోవడం రాజకీయ పాలకులకు కొత్తేమీ కనప్పటికీ ఈ మధ్యకాలంలో అలాంటి దుష్క్రియలు ఉవ్వెత్తున కొనసాగుతున్నాయని అన్నారు. ప్రజల ఆశీర్వాదాలతో గెలిచామని చెప్పుకుంటూనే ప్రజలను మోసగించడం భరించరాని మోసం అని తెలిసినప్పటికీ ప్రజాప్రతినిధులు ప్రభుత్వాలు వాటినే కొనసాగిస్తున్నారని అలాంటి స్వభావం ప్రభుత్వాలది ఐతేనేమి ప్రజాప్రతినిధులది ఐతేనేమి సమాజంలో వాళ్లను హీనంగాను, అవమానకరంగాను మారుస్తుందనన్నది గమనించాలన్నారు.

దాడులు దేనికి సాదృశ్యం

ఆత్మగౌరవంతో బ్రతకాలనుకునేవాడు ఆదర్శంగా నిలుస్తారు కానీ రాజకీయ వైరుధ్యాలకు తావిస్తూ దాడులను ప్రేరేపిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వాలు అన్నాక ప్రజల నుండి ప్రజాసంఘాల నుండి ప్రజాస్వామ్యవాదుల నుండి మేధావుల నుండి రైతుల నుండి కార్మికుల నుండి విమర్శలు రావడం సహజమని అలాంటి విమర్శలను తిప్పి కొట్టడం కోసం అధికార పాలనలో అభివృద్ధితో సమాధానం చెప్పాల్సింది పోయి ప్రశ్నిస్తున్న వ్యక్తులపై ఉద్యమకారులపై ప్రజాసంఘాలపై ప్రతిపక్ష పార్టీలపై దాడులు మాత్రమే చేయించి సమాధానం చెబుదామని భావించడం మూర్ఖత్వమన్నారు. రాజకీయ నాయకులన్నాక ప్రజాప్రతినిధులన్నాక కాస్తంత సహనం ఓపిక ఎంతో అవసరమని ప్రతి చిన్న విషయాన్ని విపరీతమైన ఆక్రోషంతో స్వీకరిస్తూ వాటిని తిప్పి కొట్టడంలో ఏకంగా మానవ స్వభావాన్ని మర్చిపోతు మానవ మృగాల స్వభావాన్ని కనపరుస్తున్నారని తీవ్రంగా హెచ్చరించారు. రాజకీయ నాయకులు అన్నాక అందరూ ఒకటేనని పార్టీలకతీతంగా వ్యాపారాలు చేసుకుంటున్న రాజకీయ నాయకులు వివిధ పార్టీలలో ఉంటున్నప్పటికీ పైకి గొడవలు పెట్టుకుంటూ పైకి ఒకరిపై ఒకరు తిట్టుకుంటూ దాడులు చేయించుకుంటూనే రహస్య సన్నిహిత్యాన్ని కొనసాగిస్తున్నారని గుర్తు చేశారు. అలాంటి రాజకీయ నాయకులు అలాంటి ప్రజాప్రతినిధులు సాధారణ వ్యక్తులను రెచ్చగొడుతూ పార్టీల పేరు మీద ఒకరిపై మరొకరిని దాడులు చేసుకునే విధంగా ప్రేరేపిస్తుండడం ఏదైతే ఉందో అది రాజకీయ సేవలకు పూర్తి విరుద్ధమని రాజకీయ ఆత్మగౌరవానికి ఏమాత్రం సరుతూగదని గుర్తు చేశారు. ఒక పార్టీలో ఉండి విపరీతమైన మోసాలు చేసి విపరీతమైన ఆస్తులు సంపాదించు ప్రభుత్వ బ్యాంకులకు చెల్లించాల్సిన సొమ్మునంత ఎగ్గొట్టి అధికార పార్టీలలోకి మారగానే ఆత్మగౌరవం కలిగిన వ్యక్తులుగా ఎలా మార్చబడుతున్నారో ఎవరికీ అర్థం కావడం లేదన్నారు. ఒక పార్టీలో ఉండి వాళ్ళు చేసిన అక్రమ దందాలకు పెట్టబడినటువంటి కేసులు,సామాన్య స్థాయిలో ఉంటూ భూకబ్జాలు చేసి వందల కోట్లు వేల కోట్లు సంపాదించిన వ్యక్తులందరూ ఆర్థికంగా స్థిరపడ్డాక రాజకీయాలను రాజకీయ పార్టీలను ఆయా ప్రాంతాలను శాసించడం తేలిక పాటుగా భావిస్తూ అక్రమంగా సంపాదించుకున్న సొమ్ముతో ప్రజాప్రతినిధులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారని అలాంటి వాళ్ళు అధికారాలు మారుతున్న ప్రతి సందర్భంలో పార్టీలు మారుతూ పార్టీల జెండాలను మారుస్తూ పార్టీల కండువాలను మారుస్తూ పూటకో పార్టీ మారే నాయకులుగా ముద్ర వేసుకొని ఆత్మగౌరవాన్ని అమ్ముకుంటూ బ్రతుకుతున్నారని చాలా సందర్భాల్లో తేలిపోతున్నప్పటికీ పార్టీలు మారిన రాజకీయ నాయకులకే పలుకుబడి ఎక్కువగా లభిస్తుందని అలాంటి వాళ్ళు ప్రభుత్వాలను శాసించే స్థాయికి ఎదుగుతున్నారని సూటిగా నిలదీశారు. ఎవరి ఆత్మగౌరవం వాళ్లకు గొప్పదైనప్పుడు ఎవరు రాజకీయ పార్టీలు వాళ్లకు గౌరవాన్ని తెచ్చిపెడుతున్నాయని భావిస్తున్నప్పుడు పార్టీలు మారుతున్న రాజకీయ ప్రజా ప్రతినిధులు ద్వితీయ శ్రేణి రాజకీయ నాయకులు ప్రజాసేవ కోసం పార్టీలు మారుతున్నామంటూ తెలుపుతూ సొంతంగా సంపాదించుకున్న అక్రమాస్తులను రక్షించుకోవడం కోసమే పార్టీలు మారుతున్నారని అలాంటివి అంతర్గతంగా నిజమని తెలిసినప్పటికీ బహిర్గతంగా మాత్రం ప్రజాసేవ కోసం ప్రాంతాల అభివృద్ధి కోసం పార్టీలు మారుతూ ప్రభుత్వాల నుండి నిధులు తెప్పించుకొని ఆత్మగౌరవంతో పనిచేస్తూ అభివృద్ధికి కట్టుబడి ఉంటామని ప్రమాణాలు చేయడం ఇదెక్కడి ఆత్మ గౌరవమో ఎటు తేల్చుకోలేకపోతున్నామన్నారు. కొన్నిచోట్ల ఎక్కడ చూసినా భూకబ్జాలతో ఆస్తులు సంపాదించుకున్న వ్యక్తులు పోలీస్ కేసుల నుండి తప్పించుకోవడానికి అధికారంలో ఉన్న రాజకీయ పార్టీల్లోనికి బలవంతంగా దూకిపోతున్నారని హెచ్చరించారు. అలాంటి వాళ్లే సొంత పార్టీల నాయకులను శాసిస్తూ ప్రజాప్రతినిధులను బొళ్తా కొట్టిస్తున్నారని హెచ్చరించారు.ఆత్మ గౌరవంతో బ్రతికేవాడు నిజాయితీగాను నిష్పక్షపాతం గాను ధైర్యంగాను సమాజానికి మేలుకరంగాను జీవిస్తున్నారని అలాంటి వాళ్లను ఎందుకు అక్కరకు రాని వాళ్ళుగా చిత్రీకరించడానికి వాళ్ళ ఆత్మ గౌరవాలను నాశనం చేయడానికి రాజకీయ పాలకులు ప్రభుత్వ అధికారులు ఏకమవుతున్నారని హెచ్చరించారు. ప్రజలు ఎప్పుడు ఆత్మగౌరవంతో బ్రతికేవాడికి అండగా ఉంటారని అలా కాకుండా అటు ఇటు కానీ బోడి పెత్తనం చేసే వాళ్ళే రాజకీయ నాయకుల పేరు చెప్పుకొని బ్రతుకుతుంటారని తీవ్రంగా విమర్శించారు. ఆత్మగౌరవం అనేది ప్రతి వ్యక్తికి వాళ్ళ వ్యక్తిగత జీవితంపై ఆధారపడి ఉంటుందని ఏ వ్యక్తి ఐనా ఏలాంటి స్థితిలో ఉన్న సమాజాన్ని ఎంతల ప్రభావితం చేయగలిగితే అంతలా ఆత్మ గౌరవాన్ని పెంపొందించుకొని ఆదర్శంగా నిలుస్తారని గుర్తించాలన్నారు.

గూడెం కార్తీక పౌర్ణమి జాతరకు పటిష్ట పోలీస్ బందోబస్తు..

ఏర్పాట్లను పరిశీలించిన సీపీ అంబర్ కిషోర్ ఝా

రామగుండం, నవంబర్ 24 (జై భీమ్ న్యూస్)




కార్తీక పౌర్ణమి సందర్భంగా దండేపల్లి మండలం గూడెం శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయంలో నిర్వహించనున్న కార్తీక జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఐపీఎస్ పోలీస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జాతర సందర్భంగా చేపట్టిన పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గూడెం శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంతో పాటు రాయపట్నం గోదావరి ఘాట్ వద్ద భక్తుల రద్దీ, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, భక్తుల రాకపోకలు, పోలీస్ బందోబస్తు తదితర అంశాలను సమీక్షించారు. జాతరకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికతో భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రశాంతంగా స్వామివారిని దర్శించుకునేలా క్యూలైన్లను క్రమబద్ధీకరించాలని, రద్దీకి అనుగుణంగా అదనపు పోలీస్ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్రతాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించే ప్రాంతాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. జాతరకు భారీగా వాహనాలు వచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ట్రాఫిక్ ప్రణాళికను అమలు చేయాలని, వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించి అవసరమైన ప్రాంతాల్లో పార్కింగ్ సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రధాన రహదారులు, ఆలయ పరిసర ప్రాంతాలు, భక్తుల రద్దీ అధికంగా ఉండే ప్రదేశాల్లో నిరంతర పోలీస్ నిఘా కొనసాగించాలని ఆదేశించారు. ముఖ్యంగా రాయపట్నం గోదావరి ఘాట్ వద్ద భక్తుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సీపీ సూచించారు. నదిలోకి భక్తులు ప్రమాదవశాత్తు వెళ్లకుండా అవసరమైన ప్రాంతాల్లో భద్రతా బారికేడ్లు ఏర్పాటు చేయాలని, ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి అక్కడ పోలీస్ సిబ్బందిని అప్రమత్తంగా ఉంచాలని తెలిపారు. నదిలో భక్తుల రక్షణ కోసం శిక్షణ పొందిన గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించేలా రక్షణ చర్యలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా మహిళలు, చిన్నారులు, వృద్ధులు, దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల భద్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. భక్తుల రద్దీని నిరంతరం పర్యవేక్షిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జాతర విధుల్లో పాల్గొనే ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది తమకు కేటాయించిన ప్రాంతాల్లో అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, ఏదైనా సమస్య తలెత్తిన వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించి సమన్వయంతో పరిష్కరించాలని సీపీ ఆదేశించారు. భక్తుల భద్రతే పోలీసుల ప్రధాన ప్రాధాన్యత అని పేర్కొన్న పోలీస్ కమిషనర్, అన్ని శాఖల అధికారులు పరస్పర సహకారంతో పనిచేసి కార్తీక పౌర్ణమి జాతరను ప్రశాంతంగా, సురక్షిత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాష్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, లక్సెట్టిపేట సీఐ రమణమూర్తి, బెల్లంపల్లి వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఎస్ఐ సురేష్, దండేపల్లి ఎస్ఐ రాజవర్ధన్ తదితర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

యూపిలో రోడ్డు ప్రమాదం..

నలుగురు విద్యార్థులు మృతి, 35 మందికి గాయాలు

లక్నో : ఉత్తరప్రదేశ్‌లోని కన్నౌజ్ సమీపంలో ఆగ్రా ? లక్నో ఎక్స్‌ప్రెస్‌వేపై ఘోర ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న స్కూల్ బస్సును వేగంగా వచ్చిన ట్రక్కు ఢీకొట్టడంతో నలుగురు విద్యార్థులు మృతి చెందారు. ప్రమాదంలో సుమారు 35 మంది విద్యార్థులు గాయపడ్డారు. పోలీసులు, రెస్క్యూ బృందాలు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. గాయపడిన విద్యార్థులను తిర్వా మెడికల్ కాలేజీకి తరలించారు. స్కూల్ ప్రిన్సిపాల్‌తో పాటు మరో విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని మెరుగైన చికిత్స కోసం కాన్పూర్‌కు తరలిస్తుండగా, స్వల్ప గాయాలైన 22 మంది విద్యార్థులకు తిర్వా మెడికల్ కాలేజీలో చికిత్స కొనసాగుతోంది.

ఎస్సీ సంక్షేమ శాఖ బాలికల హాస్టల్ మార్పుపై విద్యార్థినుల ఆందోళన!









దిల్‌సుఖ్‌నగర్‌లోనే కొనసాగించాలని 87 మంది విద్యార్థినుల విజ్ఞప్తి..
సోషల్ వెల్ఫేర్ డీడీ ప్రత్యేక చొరవ తీసుకోవాలి..
మంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లి న్యాయం చేయాలి: డాక్టర్ బరిగెల శివ

హైదరాబాద్ (జై భీమ్ న్యూస్)

ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కాచిగూడ బాలికల హాస్టల్-1ను మరో ప్రాంతానికి తరలించాలనే ప్రతిపాదనపై విద్యార్థినులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం దిల్‌సుఖ్‌నగర్‌లో కొనసాగుతున్న హాస్టల్‌ను నల్లకుంటకు మార్చేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారనే సమాచారంతో విద్యార్థినులు తమ అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నారు. తమ విద్యా అవసరాలు, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని హాస్టల్‌ను ప్రస్తుత ప్రాంతంలోనే కొనసాగించాలని కోరుతున్నారు.

విద్యార్థినుల చదువులకు దిల్‌సుఖ్‌నగర్ ఎంతో అనుకూలం

ప్రస్తుతం దిల్‌సుఖ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో అనేక కోచింగ్ సెంటర్లు, స్టడీ హాళ్లు, గ్రంథాలయాలు, ఇతర విద్యా సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని విద్యార్థినులు పేర్కొంటున్నారు. ఉన్నత విద్యతో పాటు వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న తమకు ఈ ప్రాంతం ఎంతో అనుకూలంగా ఉందని వివరిస్తున్నారు. ప్రతిరోజూ కోచింగ్ తరగతులకు హాజరుకావడం, స్టడీ హాళ్లలో చదువుకోవడం వంటి అవసరాలకు ప్రస్తుత హాస్టల్ ప్రాంతం ఎంతో ఉపయోగకరంగా ఉందని చెబుతున్నారు.

నల్లకుంటకు తరలిస్తే చదువులకు ఇబ్బందులు

హాస్టల్‌ను నల్లకుంటకు మార్చడం వల్ల తమకు అనేక ఇబ్బందులు ఎదురవుతాయని విద్యార్థినులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోచింగ్ సెంటర్లకు వెళ్లేందుకు అదనపు ప్రయాణ సమయం, రవాణా ఖర్చులు పెరగడంతో పాటు చదువులకు కేటాయించే సమయం తగ్గిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఒక విద్యా ప్రణాళికతో ముందుకు సాగుతున్న తమకు హాస్టల్ మార్పు ఇబ్బందికరంగా మారుతుందని పేర్కొంటున్నారు.

87 మంది విద్యార్థినుల సంతకాలతో వినతిపత్రం

ఈ సమస్యపై విద్యార్థినులు 2026 అక్టోబర్ 8న సంబంధిత అధికారి ప్రవీణ్ కుమార్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. మొత్తం 87 మంది విద్యార్థినులు సంతకాలు చేసిన వినతిపత్రంలో తమ సమస్యలను వివరించారు. హాస్టల్‌ను నల్లకుంటకు తరలించకుండా, ప్రస్తుతం దిల్‌సుఖ్‌నగర్‌లో ఉన్న పాత భవనంలోనే కొనసాగించాలని కోరారు. తమ విద్యా అవసరాలను పరిగణనలోకి తీసుకుని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

భవన సమస్యలు ఉంటే పరిష్కరించాలి.. హాస్టల్‌ను తరలించవద్దు

ప్రస్తుత హాస్టల్ భవనంలో ఏవైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించేందుకు అవసరమైన మరమ్మతులు చేపట్టాలని, విద్యార్థినులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు. భవన సమస్యల పరిష్కారం పేరుతో తమ విద్యాభ్యాసానికి అనుకూలంగా ఉన్న ప్రాంతం నుంచి హాస్టల్‌ను తరలించడం వల్ల భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురవుతాయని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లి విద్యార్థినులకు న్యాయం చేయాలి: డాక్టర్ బరిగెల శివ

ఈ సమస్యపై జై భీమ్ సంస్థల ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ బరిగెల శివ ప్రత్యేకంగా స్పందించారు. 87 మంది ఎస్సీ సంక్షేమ శాఖ బాలికల హాస్టల్ విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యను అధికారులు తక్షణమే పరిష్కరించాలని కోరారు. సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ (డీడీ) ప్రత్యేక చొరవ తీసుకుని, ఈ సమస్యను సంబంధిత మంత్రివర్యుల దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థినుల భవిష్యత్తు, విద్యా అవసరాలను దృష్టిలో ఉంచుకుని వారికి పూర్తిస్థాయిలో న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని కోరారు. హాస్టల్ భవనంలో సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించి, విద్యార్థినులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. విద్యార్థినుల అభిప్రాయాలను గౌరవిస్తూ దిల్‌సుఖ్‌నగర్‌లోనే హాస్టల్ కొనసాగించే అంశాన్ని సానుకూలంగా పరిశీలించాలని అన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థినులు ఎన్నో ఆర్థిక ఇబ్బందులను అధిగమించి ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని, అలాంటి విద్యార్థినులకు ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు అండగా నిలవాలని డాక్టర్ బరిగెల శివ పేర్కొన్నారు. విద్యార్థినులు తమ సమస్యల పరిష్కారం కోసం రోడ్లపైకి వచ్చి ఆందోళన చెందాల్సిన పరిస్థితి రాకూడదని, అధికారులు బాధ్యతాయుతంగా స్పందించాలని కోరారు. 87 మంది విద్యార్థినుల విజ్ఞప్తిని సోషల్ వెల్ఫేర్ డీడీ ప్రత్యేకంగా పరిశీలించి, సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లి, సమస్యకు త్వరితగతిన పరిష్కారం చూపాలని డాక్టర్ బరిగెల శివ విజ్ఞప్తి చేశారు. హాస్టల్ మార్పు కంటే విద్యార్థినుల విద్యాభివృద్ధి, వారి అభిప్రాయాలు, సౌకర్యాలకే ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.



కేయూలో 'పార్ట్ టైం' వీసి

సమయపాలన లోపంతో కేయూ పరిస్థితి అస్తవ్యస్తం.
అధికార హోదాకు తగిన న్యాయం జరగడం లేదు.
పార్ట్ టైం వీసి పార్ట్ టైం అధ్యాపకుల జీవితాలను నాశనం చేస్తున్నాడు.
పార్ట్ టైం అధ్యాపకులపై కక్షపెంచుకున్నారు.
అర్థం పర్థం లేని సమాధానాలతో వేధిస్తున్నాడు.
వీసీ ఛాంబర్ డోర్ మూసివేసుకుంటున్నారు.
వీసీ చాంబర్ గ్రిల్స్ ను మూసి వేస్తూ ఉద్యోగులతో బెదిరింపులకు పాల్పడుతున్నారు.
నన్ను కలవద్దు రిజిస్ట్రార్ ను కలవండి అంటూ దాటవేస్తున్నారు.
నాకేం సంబంధం లేదు అంతా వీసికె తెలుసు అంటూ కరాకండిగా మాట్లాడుతున్న రిజిస్ట్రార్ వి. రామచంద్రం.
గిట్లయితే కేయూలో ఏ వర్గానికి న్యాయం జరుగుతుందో అధికారులే చెప్పాలి

హైదరాబాద్ జై భీమ్ డెస్క్ :-

కేయూ పాలన అస్తవ్యస్తంగా మారిపోతుండడానికి వీసీ సమయపాలన లోపమే కారణమంటూ విద్యార్థులు తీవ్రంగా మండిపడుతున్నారు.

కాకతీయ విశ్వవిద్యాలయ వీసి ప్రతాప్ రెడ్డి తను బాధ్యతలు చేపట్టిన కొత్తలో విశ్వవిద్యాలయ సమస్యల పట్ల చర్చించడానికి తన కార్యాలయపు గదుల తలుపులు ఎప్పుడు తెరుచుకొని ఉంటాయంటూ పలు సందర్భాల్లో తెలియజేసి రాను రాను సమస్యలను వినడం కాదు కదా వీసీ చాంబర్ తలుపులను మూసివేసుకొని తన వద్దకు ఎవరిని రానివ్వద్దంటూ ఉద్యోగులను డోర్ వద్ద గ్రిల్స్ వద్ద కాపలాదారులుగా బౌన్సర్లుగా పెట్టుకుంటూ తనను కలవడానికి వచ్చిన సాధారణమైన వాళ్లను బలవంతంగా వెళ్ళగొట్టిస్తూ తన అనుకూలమైన వ్యక్తులు వస్తున్న సందర్భంలో వాళ్లకు మాత్రమే మాట్లాడటానికి అవకాశం కల్పిస్తూ తన అధికార ఆధిపత్యాన్ని ఏకపక్షం వైపు నడిపిస్తుండడం విశ్వవిద్యాలయ అధికార హోదాను తీవ్ర స్థాయిలో దుర్వినియోగ పరుస్తున్నాఠిని విశ్వవిద్యాలయ మేధావులు భావిస్తున్నారు. వారంలో కేవలం రెండు నుండి మూడు రోజులు మాత్రమే ప్రత్యక్ష పరిపాలన కొనసాగిస్తూ మిగిలిన రోజులు పట్నంలో గడుపుతున్న వీసీ ప్రతాపరెడ్డికి తను లేని సమయంలో కేయూలో జరుగుతున్న అరాచకాలపై అసాంఘిక కార్యకలాపాలపై అవినీతి అక్రమాలపై మోసపూరితమైన, కుట్రపూరితమైన విధానాలపై ఏమాత్రం నిజనిర్ధారణతో కూడిన సమాచారం తెలుసుకోకుండా కేయూలో తన చుట్టూ ఉన్న వర్గంలో ఇద్దరు ముగ్గురు పెద్దమనుషులు చెప్పిందే వేదంగాను వాళ్ళు చేసిందే శాసనంగా వాళ్ళు ఏది చెప్తే దానికి తలుపుతూ విశ్వవిద్యాలయాన్ని పాడు చేస్తున్నారని విద్యార్థి సంఘాలు తీవ్రంగా ఆందోళన చెందుతున్నాయి. వచ్చిన కొత్తలో వీసీ మాట్లాడిన మాటలను జ్ఞాపకం చేసుకోవాల్సి వస్తుండగా అవినీతిపై అక్రమాలపై ఉక్కుపాదం మోపుతానని అలాంటివి ఎట్టి పరిస్థితుల్లో సహించబోనని విశ్వవిద్యాలయానికి గట్టి సందేశాన్ని గట్టి సాంకేతాన్ని ఇచ్చినటువంటి ప్రతాప్ రెడ్డి రానురాను విశ్వవిద్యాలయం మొత్తంలో అవినీతి అక్రమాలు పెద్ద ఎత్తున జరుగుతుండగా అవన్నీ కేయూకు కేరాఫ్ అడ్రస్ నిలిచిపోతున్నప్పటికీ వీసీ వాటిని నియంత్రించడంలో తన ప్రభావాన్ని ఎక్కడ కనపరచకపోవడం విడ్డూరంగా ఉందంటూ విద్యార్థి సంఘాలు మండిపడుతున్నారు. తనకు అనుకూలమైన వర్గాలు ఎన్ని మోసాలు చేసిన కమిటీలతో కాలయాపన చేస్తూ వాళ్లను కాపాడుతూ యూనివర్సిటీ పాలనను నడిపిస్తున్నారని విశ్వవిద్యాలయంలో తీవ్రమైన చర్చ నడుస్తుంది. విద్యార్థుల మనోభావాలను దెబ్బతీస్తూ అకారణంగా ఫీజుల వసూళ్లకు పాల్పడుతూ బలవంతపు ఒత్తిళ్లతో ఫీజులు వసూలు చేయిస్తూ తన ఆధిపత్యాన్ని చెలాయిస్తున్నారని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తను లేని సమయంలో ఎవరికి వారే వీసీ హోదాలో తెగ బిల్డప్పులతో రెచ్చిపోతూ సమస్యల పరిష్కారం మార్గం అనే

కేయూలో అక్రమార్కులకు అధికారుల అండ.. త్వరలో..



సరికి ఒకరిపై ఒకరు నెట్టుకుంటూ వీసీ వచ్చాక చూద్దాం అంటూ తప్పించుకుంటున్నారని అధికార పదవి అనేసరికి తెగ ముచ్చట పడుతున్న అధికారులు సమస్యల పరిష్కారం అనేసరికి ముఖం చాటేస్తూ వాళ్ల వద్దకు సమస్యల పరిష్కారం కోసం వస్తున్న వ్యక్తులపై తీవ్రమైన కక్షగడుతున్నారని విశ్వవిద్యాలయం మేధావులు పూర్తిస్థాయిలో హెచ్చరిస్తున్నారు. కేయూలో పరిపాలన భవనం చుట్టూ సమస్యలపర్వం నుడిగుండంలా తిరుగుతున్నప్పటికీ అధికారులకు మాత్రం వాటిని పరిష్కరించాలనే కాస్తంత చలనం కూడా లేకపోవడం విడ్డూరంగా ఉంది. కొత్త కొత్త పదవులను సృష్టించుకొని కేయూను నాశనంలోనికి నెట్టేస్తున్నారని హెచ్చరించనైనది. ప్రస్తుతం కేయూలో చిన్న సమస్య పరిష్కారానికి కూడా నలుగురు అధికారుల చుట్టూ పిచ్చి వాళ్ళలా తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందనేది చాలా స్పష్టంగా కనిపిస్తున్నట్లు విద్యార్థి సంఘాలు వాపోతున్నారు. అక్రమాలకు సంబంధించిన ఫైల్స్ అనేసరికి అధికారులంతా ఏకమై వీసీ చాంబర్లో రహస్య సమావేశాలు పెట్టుకొని వాటిని నిజాయితీ ఫైల్స్ గా చిత్రీకరించడానికి తెగ గాబరపడుతున్నారని కాకతీయ విశ్వవిద్యాలయ పాలనలో జరుగుతున్న కొన్ని అంతర్గత ఫైల్స్ వివరాలు బహిర్గతం చేస్తున్నాయి.వీసీ లాడ్జిలో కూడా ఎవరిని కలవకూడదంటూ హుకుం జారీ చేసినప్పటికీ తనకు అకనుకూలమైన ఒకరిద్దరూ అధికారులు మాత్రం లాడ్జికి సైతం వెళ్తూ వాళ్ళ ఆధిపత్యాన్ని చలాయించుకుంటున్నారు. వీసీ అన్నాక పూర్తిస్థాయిలో కేయూ పాలన కోసం సమయాన్ని కేటాయించాల్సి ఉంటుండగా అరకొర సమయంతో పాలన గడుపుతున్న వీసీ తను కేయూ కోసం కేటాయిస్తున్న సమయం అంతా అనుకూల వర్గాలకే సమయమిస్తూ మిగతా వాళ్లను కలవకుండా తలుపులు వేసుకొని పాలన చేస్తున్నారని విశ్వవిద్యాలయంలో అన్ని వర్గాలు మండిపడుతున్నాయి. తన చుట్టుపక్కల అధికారులు వాళ్లకు వ్యతిరేకవర్గాలుగా భావిస్తున్నటువంటి వ్యక్తుల పట్ల నేరుగా వీసీతో బెదిరింపులకు పాల్పడుతూ చాలామందిని భయభ్రాంతులకు గురిచేస్తూ అధికార పదవులను అనుభవిస్తున్నారని కేయూకు పట్టిన దరిద్రం ఎప్పుడు వీడుతుందో తెలియదు గానీ కేయూ లోని అన్ని వర్గాలను సమస్యల వలయంలోనికి నెట్టేసి వీసీతో పాటు మిగతా ధికారులంతా అధికార పదవులతో ఆనందాల్లో మునిగితేలుతున్నారని హెచ్చరించనైనది. సమస్యలను పరిష్కరించలేని అధికారులు సమస్యలను దీర్ఘకాలికంగా పొడిగిస్తూ అన్ని వర్గాలను వేధిస్తున్న అధికారులు తక్షణమే అధికార పదవులను వదిలేసి వాళ్ళ నిజాయితీని చాటుకోవాలని కేయూ లోని అన్ని వర్గాలు హెచ్చరిస్తున్నాయి.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE సమస్యలపై సమరంగా Jai Bheem TV సామాన్యుడి ఆయుధంగా

ఇందిరమ్మ కుటుంబ బీమా నమోదు పకడ్బందీగా చేపట్టాలి

నామినీ వివరాల నమోదు తప్పనిసరి..
పొరపాట్లకు తావులేకుండా పరిశీలించాలి
డిసెంబర్ 18 వరకు నమోదు ప్రక్రియ..
అధికారులకు కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశం



వరంగల్, నవంబర్ 24 (జై భీమ్ న్యూస్)

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం లబ్ధిదారుల నమోదు ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. మంగళ వారం జిల్లా అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో పథకం అమలు, నమోదు కేంద్రాల పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 19న ప్రారంభమైన నమోదు ప్రక్రియ డిసెంబర్ 18 వరకు కొనసాగుతుందని తెలిపారు. ప్రతి కుటుంబం బీమా కోసం ఎంపిక చేసుకున్న వ్యక్తి వివరాలతో పాటు నామినీ పేరును తప్పనిసరిగా పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. బీమా పొందే వ్యక్తి వయస్సు 18 నుంచి 59 సంవత్సరాల మధ్య ఉండాలని, నమోదు సమయంలో ఆధార్, కుటుంబ వివరాలు, నామినీ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. నామినీలకు కేటాయించే వాటాల శాతం మొత్తం 100 శాతంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోర్టల్‌లో వివరాలు నమోదు చేసిన అనంతరం మరోసారి పరిశీలించి ధ్రువీకరించాలని, నమోదు కేంద్రాల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ పెండింగ్ దరఖాస్తులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి పథకం ప్రయోజనం అందేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు ఎల్. కిషోర్ కుమార్, వై.వి. గణేష్, డీఆర్వో విజయలక్ష్మి, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సుమ, ఉమారాణి, జెడ్పీ సీఈవో వసంత, డీపీవో కల్పన, సీపీవో చంద్రకళ, డీఆర్డీవో నాగపద్మజ, వివిధ మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుల్ గ్రాండ్ టెస్ట్ నిర్వహణ





హనుమకొండ నవంబర్ 24(జై భీమ్ న్యూస్)

హనుమకొండ: కాకతీయ విశ్వవిద్యాలయంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అధ్యయన కేంద్రం మరియు సమీక్ష ఐఏఎస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుల్ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం గ్రాండ్ టెస్ట్ నిర్వహించారు. ఈ గ్రాండ్ టెస్ట్ ప్రారంభ కార్యక్రమంలో సీఐ శ్రీ రవికుమార్ గారు, ప్రొఫెసర్ సురేష్‌లాల్ గారు, ప్రొఫెసర్ నారాయణ గారు, సమీక్ష ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ గారు, డాక్టర్ వాసు డాక్టర్ పుల్ల కుమారస్వామి గారు పాల్గొని గ్రాండ్ టెస్ట్ ప్రశ్నపత్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగాల సాధనకు నిరంతర సాధన, క్రమశిక్షణ, పట్టుదల, ప్రణాళికాబద్ధమైన అధ్యయనం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఇటువంటి గ్రాండ్ టెస్టులు అభ్యర్థులకు వాస్తవ పరీక్షల అనుభవాన్ని అందించడంతో పాటు, వారి సామర్థ్యాలను అంచనా వేసుకోవడానికి, సమయపాలనను అలవర్చుకోవడానికి ఉపయోగపడతాయని తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షలపై అవగాహన కల్పిస్తూ, నాణ్యమైన శిక్షణ అందించడం అభినందనీయమని అతిథులు ప్రశంసించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అధ్యయన కేంద్రం జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పుల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు మరియు నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షల్లో సమాన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో కేంద్రం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. యువత పోలీస్ ఉద్యోగాలను సాధించి సమాజానికి సేవ చేసే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం ద్వారా అభ్యర్థుల్లో ఆత్మవిశ్వాసం, పోటీతత్వం పెంపొందించడమే కాకుండా, ప్రభుత్వ ఉద్యోగాల సాధనకు మరింత ప్రోత్సాహం లభించింది. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టడీస్ సెంటర్ కాకతీయ విశ్వవిద్యాలయం, హనుమకొండ సమీక్ష ఐఏఎస్ అకాడమీతో సంయుక్త నిర్వహణ.

విద్యార్థినికి అసభ్య సందేశాలు..

సంగారెడ్డి, నవంబర్ 24 (జై భీమ్ న్యూస్) :

అమీన్‌పూర్ పరిధిలోని పటేల్‌గూడ ఎల్లంకి పాలిటెక్నిక్ కళాశాలలో ఇంగ్లీష్ లెక్చరర్‌పై విద్యార్థులు దాడి చేసి చితకబాదారు. డిప్లొమా మొదటి సంవత్సరం విద్యార్థినికి లెక్చరర్ రవి అసభ్య సందేశాలు పంపుతూ, రోజూ చాటింగ్ చేయాలని వేధించినట్లు ఆరోపణలు వచ్చాయి. వాట్సాప్ సందేశాల తెరచిత్రాలు చూసి ఆగ్రహించిన తోటి విద్యార్థులు లెక్చరర్‌పై దాడి చేయగా, ఘటనా స్థలానికి చేరుకున్న అమీన్‌పూర్ పోలీసులు రవిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నిద్రమత్తులో టౌన్‌ప్లానింగ్..!

నాని గార్డెన్ పక్కన.. భారీ ఐదు అంతస్తుల భవన నిర్మాణం..
సెట్‌బ్యాక్‌లు, పార్కింగ్, డ్రైనేజీ నిబంధనలు పాటిస్తున్నారా?
17-2-358/11/2 నంబర్‌పై సమాధానం చెప్పేదెవరు?
అనుమతి పై అనుమానాలెన్నో....

గ్రేటర్ వరంగల్, నవంబర్ 24 (జై భీమ్ న్యూస్)

గ్రేటర్ వరంగల్ పరిధిలోని ఉర్సుగుట్ట సమీపంలో, నాని గార్డెన్ పక్కన నిర్మాణంలో ఉన్న ఐదు అంతస్తుల భవనం పలు ప్రశ్నలను లేవనెత్తుతోంది. భారీ నిర్మాణం కొనసాగుతున్నా టౌన్‌ప్లానింగ్ అధికారుల పర్యవేక్షణ ఎక్కడ? అనుమతులకు అనుగుణంగానే నిర్మాణం జరుగుతోందా? సామాన్యుల నిర్మాణాలపై నిబంధనలు కఠినంగా అమలు చేసే అధికారులు ఈ భవనం విషయంలోనూ అదే విధంగా వ్యవహరిస్తున్నారా? 17-2-358/11/2 అనుమతి నంబర్‌తో మంజూరైన ప్లాన్‌లో ఎన్ని అంతస్తులకు అనుమతి ఉంది? ఐదు అంతస్తుల నిర్మాణానికి ఆమోదం ఉందా? సెట్‌బ్యాక్‌లు, పార్కింగ్, డ్రైనేజీ నిబంధనలు పాటిస్తున్నారా? అనుమతులు, క్షేత్రస్థాయి నిర్మాణం మధ్య వ్యత్యాసాలున్నాయా? సిటీ ప్లానర్ తక్షణమే తనిఖీ చేసి వాస్తవాలను వెల్లడించాలి.అనుమతులు మంజూరు చేసిన అధికారి ఎవరు? నిర్మాణాన్ని పర్యవేక్షించాల్సిన బాధ్యత ఎవరిది? నిబంధనల ఉల్లంఘనలు ఉన్నాయా? ఆర్థిక లావాదేవీలపై వ్యక్తమవుతున్న అనుమానాల్లో వాస్తవమెంత? అనే అంశాలపై ఉన్నతాధికారులు విచారణ జరపాలి. ఆరోపణలు నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.నిర్మాణం పూర్తయిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే ఇప్పుడే పర్యవేక్షణ చేపట్టడం అధికారుల బాధ్యత. భవనంపై అధికారుల స్పందనే ఈ ప్రశ్నలకు సమాధానం కావాలి. – జై భీమ్ న్యూస్ ప్రతినిధి హన్మకొండ శ్రీకాంత్.



స్వేరో స్టూడెంట్స్ యూనియన్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఘనంగా ప్రతిజ్ఞ దివస్ మహాసభ

ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల హనుమకొండ, ఆడిటోరియం





హనుమకొండ నవంబర్ 24(జై భీమ్ న్యూస్)

ఈరోజు కాకతీయ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియంలో స్వేరోస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ దివస్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ పుల్లా శ్రీనివాస్, రాచకొండ ప్రవీణ్ న్యాయవాది పాల్గొని విద్యార్థులకు స్పష్టంగా వివరిస్తూ మద్యానికి ,మాంసానికి, తంబాకు ,పాన్ బార్, ఇలాంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని విద్యార్థులతో కలిసి ప్రమాణం చేయడం జరిగింది స్వేరో అంటే ఒక ప్రతిష్టాత్మకమైన సంఘం కాబట్టి విద్యార్థులకు తగిన మంచి మాటలు చెప్పి చెడు మార్గాన పడకుండా ఈ ప్రతిష్టాత్మకమైన ప్రతిజ్ఞ దివస్ కార్యక్రమం నిర్వహించడం హర్షించదగిన విషయమని గుర్తు చేశారు ఈ కార్యక్రమంలో ప్రతిజ్ఞ దివాస్ కన్వీనర్ ఎల్తూరి సాయికుమార్ కో కన్వీనర్లు స్వేరో సీనియర్ నాయకులు మరియు స్వేరోస్ అనుబంధ సంఘ నాయకులు పాల్గొనడం జరిగింది.

కార్తీక పౌర్ణమి సందర్భంగా ఘనంగా బుద్ధ వందన కార్యక్రమం



హన్మకొండ, నవంబర్ 24 (జై భీమ్ న్యూస్)

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని హనుమకొండ అంబేద్కర్ సెంటర్‌లోని గౌతమ బుద్ధుని విగ్రహం ఎదుట బీఎస్ఐ హనుమకొండ, వరంగల్ జిల్లా బాధ్యుల ఆధ్వర్యంలో బుద్ధ వందన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతమ బుద్ధునికి ప్రత్యేక వందనాలు సమర్పించి, బుద్ధుని బోధనలను స్మరించుకున్నారు. బుద్ధుడు చూపిన శాంతి, అహింస, ప్రేమ, అనురాగం, మానవతా విలువల మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. సమాజంలో శాంతి, సామరస్యం నెలకొనాలంటే బుద్ధుని ఆలోచనా విధానాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలని సూచించారు. బుద్ధుని ఆశయాలు, బోధనలు సమాజానికి నేటికీ ఎంతో అవసరమని, ద్వేషం, హింసలకు దూరంగా ఉంటూ ప్రేమ, కరుణ, సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బౌద్ధులు, అంబేద్కర్‌వాదులు, ప్రజాసంఘాల నాయకులు, పలువురు బుద్ధుని అనుచరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

కాకతీయ యూనివర్సిటీలో ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుల్ గ్రాండ్ టెస్ట్

పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ప్రోత్సాహం..





హన్మకొండ, నవంబర్ 24 (జై భీమ్ న్యూస్)

కాకతీయ విశ్వవిద్యాలయంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అధ్యయన కేంద్రం, సమీక్ష ఐఏఎస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుల్ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం గ్రాండ్ టెస్ట్ నిర్వహించారు. ఈ గ్రాండ్ టెస్ట్ ప్రారంభ కార్యక్రమానికి సీఐ రవికుమార్, ప్రొఫెసర్ సురేష్‌లాల్, ప్రొఫెసర్ నారాయణ, సమీక్ష ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ వాసు, డాక్టర్ పుల్ల కుమారస్వామి తదితరులు హాజరై ప్రశ్నపత్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగాలను సాధించాలంటే నిరంతర సాధన, క్రమశిక్షణ, పట్టుదలతో పాటు ప్రణాళికాబద్ధమైన అధ్యయనం ఎంతో అవసరమని అన్నారు. ఇలాంటి గ్రాండ్ టెస్టులు అభ్యర్థులకు వాస్తవ పరీక్షల అనుభవాన్ని అందించడంతో పాటు, తమ సామర్థ్యాలను అంచనా వేసుకోవడానికి, సమయపాలనను అలవర్చుకోవడానికి ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షలపై అవగాహన కల్పిస్తూ నాణ్యమైన శిక్షణ అందించడం అభినందనీయమని ప్రశంసించారు. అనంతరం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అధ్యయన కేంద్రం జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పుల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు, నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షల్లో సమాన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో అధ్యయన కేంద్రం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. యువత కష్టపడి చదివి పోలీస్ ఉద్యోగాలు సాధించి సమాజ సేవలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ గ్రాండ్ టెస్ట్ ద్వారా అభ్యర్థుల్లో ఆత్మవిశ్వాసం, పోటీతత్వం పెంపొందించడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగాల సాధన దిశగా మరింత ప్రోత్సాహం లభించింది.

భారీ ర్యాలీగా ఉమామహేశ్వర్ రెడ్డి ప్రచారం

చిట్వేలి, నవంబర్ 24 (జై భీమ్ న్యూస్) :

చిట్వేలి గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా ఉంగరం గుర్తుపై పోటీ చేస్తున్న చౌడవరం ఉమామహేశ్వర్ రెడ్డి మంగళవారం మధ్యాహ్నం గ్రామంలోని ప్రధాన వీధిలో భారీ ర్యాలీ నిర్వహిస్తూ విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేపట్టారు. అభిమానులు, ఆత్మీయులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు మద్దతుగా నినాదాలు చేస్తూ ప్రచారంలో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వర్ రెడ్డి గ్రామంలో పర్యటిస్తూ ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకొని తనకు ఉంగరం గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. గ్రామ ప్రజల ఆశీస్సులు, అభిమానుల ఆదరణతో సర్పంచ్‌గా ఎన్నికై గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ర్యాలీ సందర్భంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయాన్ని సందర్శించిన ఉమామహేశ్వర్ రెడ్డి అమ్మవారి ఆశీస్సులు తీసుకొని ప్రచారాన్ని కొనసాగించారు. అనంతరం ప్రధాన వీధిలో సాగిన ర్యాలీలో ఆయనకు మద్దతుగా అభిమానులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. బాణాసంచా పేలుస్తూ, ఉంగరం గుర్తుపై ఓటు వేసి ఉమామహేశ్వర్ రెడ్డిని గెలిపించాలని ఓటర్లను కోరారు. గ్రామంలోని పలువురు స్థానికులు, యువకులు, మహిళలు ర్యాలీలో పాల్గొనడంతో ప్రచార కార్యక్రమం సందడిగా సాగింది. ప్రతి ఒక్కరినీ కలుసుకుంటూ ఓటర్ల మద్దతు కోరిన ఉమామహేశ్వర్ రెడ్డి, తనను గెలిపిస్తే ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని పేర్కొన్నారు. మొత్తంగా చిట్వేలి గ్రామంలో ఉమామహేశ్వర్ రెడ్డి నిర్వహించిన భారీ ర్యాలీ ఎన్నికల ప్రచారంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

పోతన భాగవతం భక్తి, దేశభక్తి ఉద్యమాలకు బీజం





ఆచార్య బన్న ఐలయ్య

హన్మకొండ, 24 నవంబర్ 2026 (జై భీమ్ న్యూస్)

బమ్మెర పోతన రచించిన శ్రీమద్భాగవతం కేవలం ఒక మత గ్రంథం మాత్రమే కాదని, అది తెలుగు ప్రజల ఆత్మను ప్రతిబింబించే అపురూపమైన సాహిత్య సంపద అని కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పూర్వ అధ్యక్షులు, ప్రముఖ సాహితీవేత్త ఆచార్య బన్న ఐలయ్య అన్నారు. దేశంలో భక్తి ఉద్యమానికి, తద్వారా మానవతా, సామాజిక సంస్కరణ ఉద్యమాలకు, చివరకు స్వాతంత్ర్య ఉద్యమానికి కూడా పోతన భాగవతం బీజం వేసిందని పేర్కొన్నారు. హనుమకొండ వడ్డేపల్లిలోని జి.ఎం.ఆర్. బృందావన్ క్లబ్ హౌస్‌లో మంగళవారం సాహిత్య సాంస్కృతిక విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 'సారస్వత సమాగమం' పేరిట 'బమ్మెర పోతనామాత్యుల జీవితం -- భాగవతామృతం' అనే అంశంపై సాహితీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య బన్న ఐలయ్య ప్రసంగించారు. ప్రముఖ న్యాయవాది, వేదిక అధ్యక్షులు ఏరుకొండ జయశంకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆచార్య బన్న ఐలయ్య మాట్లాడుతూ భారతం, రామాయణం, భాగవతం భారతీయ సంస్కృతికి ప్రతిబింబాలుగా నిలిచిన మహోన్నత గ్రంథాలని తెలిపారు. ఇతర భాషల వారు సంస్కృతం నుంచి భారతం లేదా రామాయణాన్ని మాత్రమే మాతృభాషల్లోకి అనువదించుకోగా, తెలుగు వారు మాత్రం ఈ మూడు మహాగ్రంథాలను తెలుగులోకి తీసుకువచ్చారని వివరించారు. పోతన తన అపారమైన కవితా ప్రతిభతో భాగవతాన్ని తెలుగు పద్య సౌందర్యంతో తీర్చిదిద్దారని కొనియాడారు. భారతదేశంలో భక్తి ఉద్యమం దక్షిణ భారతదేశంలో, ముఖ్యంగా తెలుగు ప్రాంతంలో బలమైన సాహిత్య పునాదులు పొందిందని, దీనికి మహాకవి పోతన రచనలు విశేషంగా దోహదపడ్డాయని అన్నారు. పోతన భాగవతం ద్వారా నాటిన భక్తి భావనలు అనంతరం మానవతా ఉద్యమంగా, సంస్కరణోద్యమంగా, రాజకీయ చైతన్యంగా విస్తరించి స్వాతంత్ర్య ఉద్యమానికి స్ఫూర్తినిచ్చాయని వివరించారు. నాటి కవులు తమ రచనలను రాజులకు అంకితం చేసి ఆస్తులు, బంగారం, ఆభరణాలు పొందే సంప్రదాయం ఉన్నప్పటికీ, పోతన మాత్రం ఆత్మగౌరవానికి ప్రాధాన్యతనిస్తూ ఎవరి ప్రలోభాలకు లొంగకుండా భగవత్ సేవగా, భారతీమాత సేవగా భాగవతాన్ని రచించారని పేర్కొన్నారు. భాగవతాన్ని ఆధ్యాత్మిక, సామాజిక, మానవ సంబంధాల కోణాల్లో అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. 'ఎవ్వనిచే జనించు' వంటి పద్యాల ద్వారా భక్తి భావంతో భగవంతుడిని ఎలా ప్రార్థించాలో పోతన చాటిచెప్పారని తెలిపారు. తెలుగు పద్యానికి లలితత్వాన్ని, మాధుర్యాన్ని అందించడంలో పోతన పాత్ర చిరస్మరణీయమని అన్నారు. పోతన జన్మస్థలం బమ్మెర అయినప్పటికీ, ఆయన రచించిన భాగవతం ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందడం తెలుగు సాహిత్యానికి గర్వకారణమని పేర్కొన్నారు. అనంతరం అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పల్లేరు వీరస్వామి పోతన జీవిత విశేషాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్తలు డాక్టర్ తుమ్మూరి లక్ష్మణరావు, మల్యాల మనోహర్ రావు, సీనియర్ న్యాయవాది మంగినంపల్లి సదాశివుడు, సామాజిక కార్యకర్త గంగిశెట్టి హరనాథ్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి రాచకట్ల లక్ష్మణ సుధాకర్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

వైద్య "పీజీ"అభ్యర్థులకు తీరని అన్యాయం




నేషనల్ కోటాలో సీట్లు పొందుకున్న విద్యార్థులకు అడ్డుపడుతున్నారు
నీట్ పీజీ కౌన్సెలింగ్‌లో సీట్ల బ్లాకింగ్ కలకలం
కేఎన్ఆర్‌యూహెచ్ఎస్ తీరుపై అభ్యర్థుల ఆగ్రహం
కౌన్సెలింగ్ గడువులపై అభ్యంతరాలు
సీట్ల నిలుపుదలతో మెరిట్ అభ్యర్థులకు అన్యాయం జరుగుతోందని ఆవేదన
ఒరిజినల్ సర్టిఫికెట్స్ ఇవ్వకుండా అడ్డుపడుతున్నారు
జోక్యం చేసుకోవాలని ఐఎంఏ-ఎంఎస్ఎన్ టీజీకి విజ్ఞప్తి

హన్మకొండ, నవంబర్ 24 (జై భీమ్ న్యూస్)

తెలంగాణలో నీట్ పీజీ వైద్య విద్య ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియలో తీవ్ర గందరగోళం నెలకొంటోందని పలువురు వైద్య విద్యార్థులు, అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అఖిల భారత కోటా, రాష్ట్ర కోటా ప్రవేశాల ప్రక్రియల్లో ఒకేసారి సీట్లు పొందిన అభ్యర్థులకు సరైన వెసులుబాటు కల్పించకపోవడంతో సీట్ల నిలుపుదల, ద్వంద్వ సీట్ల కేటాయింపు సమస్యలు తలెత్తుతున్నాయని ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై కాళోజీ నారాయణరావు ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం (కేఎన్ఆర్‌యూహెచ్ఎస్) అధికారులు తక్షణమే స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నారు. అభ్యర్థులు వెల్లడించిన వివరాల ప్రకారం.. నవంబర్ 19వ తేదీన అఖిల భారత కోటా రెండో విడత కౌన్సెలింగ్ ఫలితాలు విడుదలయ్యాయి. అదే రోజు రాష్ట్ర కోటా మొదటి విడతలో సీట్లు పొందిన అభ్యర్థుల కళాశాలల్లో చేరిక గడువు కూడా ముగిసింది. దీంతో నవంబర్ 19న రాష్ట్ర కోటా సీట్లలో చేరిన కొందరు అభ్యర్థులకు అదే రోజు రాత్రి అఖిల భారత కోటాలోనూ సీట్లు కేటాయించబడ్డాయి. అయితే అఖిల భారత కోటాలో సీట్లు పొందిన అభ్యర్థులకు నవంబర్ 25వ తేదీ వరకు కళాశాలల్లో చేరేందుకు, అదే తేదీ వరకు ఎటువంటి జరిమానా లేకుండా సీటును వదులుకునేందుకు అవకాశం కల్పించినప్పటికీ, రాష్ట్ర కోటాలో ఇప్పటికే చేరిన అభ్యర్థులకు సీటును వదులుకునే అవకాశం కల్పించలేదని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు రాష్ట్ర కోటా రెండో విడత వెబ్ ఎంపికల ప్రక్రియను నవంబర్ 24వ తేదీ ఉదయం 6 గంటల నుంచి నవంబర్ 25వ తేదీ మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే నిర్వహించేందుకు విశ్వవిద్యాలయం నిర్ణయించడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఇంత తక్కువ సమయంలో ఎంపికల ప్రక్రియను పూర్తి చేయడం వల్ల అభ్యర్థులకు తగిన సమయం, అవకాశం లభించడం లేదని పేర్కొంటున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది రాష్ట్ర కోటా మొదటి విడతలో సీట్లు వదులుకున్న అభ్యర్థుల సంఖ్య గణనీయంగా తగ్గిందని చెబుతున్నారు. గత ఏడాది 117 మంది అభ్యర్థులు సీట్లు ఖాళీ చేయగా, ఈ ఏడాది కేవలం 69 మంది మాత్రమే సీట్లు వదులుకున్నారని వెల్లడిస్తున్నారు. అఖిల భారత కోటాలో సీట్లు పొందినప్పటికీ రాష్ట్ర కోటాలో గతంలో పొందిన సీట్లను వదులుకునే అవకాశం లేకపోవడమే ఇందుకు కారణమని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. దీంతో రాష్ట్ర కోటాలో కొనసాగాలనే ఉద్దేశం లేని కొందరు అభ్యర్థులు సైతం తమ వద్ద ఉన్న సీట్లను వదులుకోకుండా కొనసాగిస్తున్నారని, ఫలితంగా రెండో విడత కౌన్సెలింగ్‌లో అందుబాటులోకి రావాల్సిన ఖాళీ సీట్ల సంఖ్య తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిణామం తదుపరి విడతల్లో సీట్ల భర్తీ, వైద్య విభాగాల ఎంపికలో సమస్యలకు దారితీసే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. అలాగే రాష్ట్ర కోటాలో చేరిన అభ్యర్థుల అసలు ధ్రువపత్రాలు కళాశాలల వద్ద ఉండిపోవడం వల్ల అఖిల భారత కోటాలో కేటాయించిన సీట్లలో చేరేందుకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. సకాలంలో ధ్రువపత్రాలు అందకపోతే అఖిల భారత కోటాలో వచ్చిన సీటును కూడా కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. దీనివల్ల స్థానిక కోటా ప్రవేశాల కటాఫ్ ర్యాంకులు పెరగడంతో పాటు అఖిల భారత కోటా కటాఫ్ ర్యాంకులు తగ్గే పరిస్థితి ఏర్పడవచ్చని అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా మధ్యస్థాయి ర్యాంకులు సాధించిన అభ్యర్థులు తదుపరి విడతల్లో సీట్ల మార్పిడి ప్రక్రియ, స్థానిక అభ్యర్థుల హోదా ఆధారంగా తమకు నచ్చిన వైద్య విభాగాల్లో సీట్లు పొందేందుకు అవకాశం ఉంటుందని ఆశిస్తారని, అయితే కౌన్సెలింగ్‌ను హడావుడిగా నిర్వహించడం, సీట్ల మార్పిడికి సరైన అవకాశం లేకపోవడం వల్ల వారి అవకాశాలు దెబ్బతింటున్నాయని పేర్కొంటున్నారు. సాధారణంగా అఖిల భారత కోటా రెండో విడత కౌన్సెలింగ్ పూర్తయిన తర్వాత రాష్ట్ర కోటా కౌన్సెలింగ్ నిర్వహించడం ద్వారా రెండు ప్రవేశాల ప్రక్రియల మధ్య సమన్వయం ఉంటుందని అభ్యర్థులు వివరిస్తున్నారు. అఖిల భారత కోటాలో రెండో విడతలో సీట్లు పొందిన అభ్యర్థులు రాష్ట్ర కోటాలో అదనపు సీట్లను నిలుపుకునే పరిస్థితి తగ్గుతుందని చెబుతున్నారు. అయితే కేవలం పది రోజుల వ్యవధిలోనే రెండు విడతల కౌన్సెలింగ్‌ను వేగంగా నిర్వహించడం వల్ల సీట్ల నిలుపుదల, ద్వంద్వ అభ్యర్థిత్వాలు, ఖాళీ సీట్ల కొరత వంటి సమస్యలు తలెత్తాయని ఆరోపిస్తున్నారు. ఈ సమస్యలపై ఇప్పటికే పలుమార్లు ఈ-మెయిల్ల ద్వారా విశ్వవిద్యాలయ అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ స్పందన రావడం లేదని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో భారత వైద్య సంఘం వైద్య విద్యార్థుల విభాగం తెలంగాణ రాష్ట్ర పరిపాలన విభాగం (ఐఎంఏ-ఎంఎస్ఎన్ టీజీ) బాధ్యులు, సభ్యులు ఈ సమస్యను అత్యవసరంగా పరిగణించి సంబంధిత అధికారులతో చర్చించాలని అభ్యర్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. వైద్య విద్యార్థులు, అభ్యర్థుల సమస్యల పరిష్కారంలో ఐఎంఏకు ఉన్న ప్రాధాన్యత, ప్రభావాన్ని ఉపయోగించి కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయ అధికారులతో మాట్లాడి తగిన పరిష్కారం చూపించాలని కోరుతున్నారు. అంతేకాకుండా ఈ సమస్యను ఇతర వైద్య విద్యార్థుల సంఘాలు, వైద్యుల సంఘాల గ్రూపులు, సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రాష్ట్ర కోటా కౌన్సెలింగ్‌లో సీటును వదులుకునే అవకాశం, ఖాళీ సీట్ల భర్తీ, సీట్ల మార్పిడి ప్రక్రియ, అసలు ధ్రువపత్రాల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో పారదర్శకత పాటిస్తూ అభ్యర్థులందరికీ సమాన అవకాశాలు కల్పించాలని, సీట్ల నిలుపుదలకు అడ్డుకట్ట వేసి మెరిట్ ఆధారంగా న్యాయమైన ప్రవేశాల విధానాన్ని అమలు చేయాలని బాధిత అభ్యర్థులు కోరుతున్నారు.

వరంగల్ డీఈఓగా ఎన్. ప్రశాంత్ రెడ్డి నియామకం

వడుప్స్ నాయకుల అభినందనలు



హసన్‌పర్తి, 24 నవంబర్ 2026 (జై భీమ్ న్యూస్)

వరంగల్ జిల్లా విద్యాశాఖ అధికారిగా (డీఈఓ) హసన్‌పర్తి వాస్తవ్యులు ఎన్. ప్రశాంత్ రెడ్డి నియమితులైన సందర్భంగా పలువురు విద్యా, సామాజిక రంగాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. స్థానిక ప్రాంతానికి చెందిన వ్యక్తి జిల్లా స్థాయి కీలక బాధ్యతలు చేపట్టడం పట్ల హసన్‌పర్తి ప్రాంతీయులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా వడుప్స్ ప్రధాన కార్యదర్శి వలస జ్ఞానేశ్వర్ రావు, హసన్‌పర్తి జోన్ అధ్యక్షులు ఆకుతోట రాంబాబు కలిసి నూతనంగా నియమితులైన జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్. ప్రశాంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్య అనేది సమాజ అభివృద్ధికి, భవిష్యత్ తరాల పురోగతికి కీలకమైన పునాది అని పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారిగా ప్రశాంత్ రెడ్డి తన అనుభవం, పరిపాలనా సామర్థ్యంతో వరంగల్ జిల్లాలో విద్యారంగ అభివృద్ధికి మరింత కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల మెరుగుదల, విద్యార్థుల ప్రతిభను వెలికితీసే కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆకాంక్షించారు. అలాగే ప్రభుత్వ విద్యాసంస్థలను మరింత బలోపేతం చేసి, పేద మరియు మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. హసన్‌పర్తి ప్రాంతానికి చెందిన ప్రశాంత్ రెడ్డి వరంగల్ జిల్లా విద్యాశాఖ అధికారిగా నియమితులు కావడం తమకు ఆనందంగా ఉందని, ఆయన పదవీకాలం విజయవంతంగా సాగాలని, విద్యారంగంలో మంచి మార్పులకు శ్రీకారం చుట్టాలని వడుప్స్ నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వలస జ్ఞానేశ్వర్ రావు, ఆకుతోట రాంబాబు పాల్గొన్నారు.

పనికిర మోహన్‌రాజ్ మాతృమూర్తి అంత్యక్రియల్లో పాల్గొన్న ప్రముఖులు





రాయపర్తి, నవంబర్ 24 (జై భీమ్ న్యూస్)

వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కొలనిపల్లి గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు పనికిర మోహన్‌రాజ్ మాతృమూర్తి పనికిర ఎల్లమ్మ నవంబర్ 23, 2026 సోమవారం రాత్రి 10 గంటలకు తుదిశ్వాస విడిచారు. ఆమె మరణంతో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు విషాదంలో మునిగిపోయారు. ఈ నేపథ్యంలో నవంబర్ 24, 2026 మంగళవారం కొలనిపల్లి గ్రామంలో నిర్వహించిన ఎల్లమ్మ అంత్యక్రియల కార్యక్రమానికి పలువురు విద్యావేత్తలు, తెలంగాణ ఉద్యమ నాయకులు, ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ సాదు రాజేష్, డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి, డి. సారయ్య తదితరులు ఎల్లమ్మ భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే కాకతీయ విశ్వవిద్యాలయం, ఉస్మానియా విశ్వవిద్యాలయాలకు చెందిన అధ్యాపకులు, మిత్రులు, శ్రేయోభిలాషులు అంత్యక్రియల్లో పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాతృవియోగంతో బాధపడుతున్న పనికిర మోహన్‌రాజ్‌కు ధైర్యం చెబుతూ తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తల్లిని కోల్పోవడం తీరని లోటని, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. పనికిర ఎల్లమ్మ మృతిపట్ల గ్రామస్తులు, బంధువులు, విద్యావేత్తలు, తెలంగాణ ఉద్యమకారులు సంతాపం వ్యక్తం చేశారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV
సామాన్యుడి ఆయుధంగా

ఉత్సాహంగా ఫ్రూట్ మిక్సింగ్ వేడుక

హైదరాబాద్, నవంబర్ 24 (జై భీమ్ న్యూస్) :

క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని అమీర్‌పేటలో కంట్రీ ఓవెన్ ఆధ్వర్యంలో సంప్రదాయ ఫ్రూట్ మిక్సింగ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండు ఫలాలు, డ్రై ఫ్రూట్స్‌ను ప్రత్యేకంగా మిక్స్ చేసి, క్రిస్మస్ కేకుల తయారీకి శ్రీకారం చుట్టారు. ఈ మిశ్రమాన్ని ప్రత్యేక పద్ధతిలో నిల్వ చేసి, క్రిస్మస్ నాటికి రుచికరమైన కేకులుగా తయారు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 1993లో ప్రారంభమైన కంట్రీ ఓవెన్ 34వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా వినియోగదారులకు, ఉద్యోగులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి సిస్టర్ నివేదిత పాఠశాల కరస్పాండెంట్ హరిహర ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పండుగల స్ఫూర్తిని, ప్రేమాభిమానాలను చాటేలా ఈ వేడుక సందడిగా సాగింది.

ముస్తాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాద స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే.

ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు.

ప్రమాదానికి కారణమైన వ్యాన్ డ్రైవర్‌పై కేసు నమోదు.. వ్యాన్ సీజ్.



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 24 (జై భీమ్ న్యూస్) :

ముస్తాబాద్ మండలం వెంకయ్యకుంట?బాధనకల్ గ్రామాల శివారులో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాద స్థలాన్ని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే మంగళవారం అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా ప్రమాదం జరిగిన తీరును, ప్రమాదానికి గల కారణాలను, రహదారి పరిస్థితులను, ఇతర సాంకేతిక అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదానికి కారణమైన వ్యాన్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, వ్యాన్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలను అన్ని కోణాల్లో విచారించి సమగ్ర దర్యాప్తు చేపట్టాలని, విచారణను వేగవంతం చేసి పూర్తి నివేదిక సమర్పించాలని డీఎస్పీ, సీఐ, ఎస్ఐలను ఆదేశించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. అధిక వేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ అప్రమత్తంగా వాహనాలు నడపాలని సూచించారు.పొగమంచు కారణంగా రహదారులపై దృశ్యమానత తగ్గి రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున వాహనదారులు అప్రమత్తంగా ఉంటూ వాహన వేగాన్ని తగ్గించి, ముందు వెళ్తున్న వాహనాలకు సురక్షిత దూరం పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని తెలిపారు. ఈ పరిశీలనలో ఎస్పీ వెంట డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ నాగేశ్వరరావు, ఎస్ఐ జ్యోతి మరియు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం...

ఇద్దరు అయ్యప్ప భక్తులు మృతి, 10 మందికి గాయాలు



చెన్నై, నవంబర్ 24 (జై భీమ్ న్యూస్) :

తమిళనాడులోని మైలం వద్ద శబరిమల యాత్రకు వెళ్తున్న ఏపీ భక్తుల వాహనం ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా, పది మంది గాయపడ్డారు. మృతుల్లో తిరుపతి జిల్లా వరదయ్యపాళెం మండలం పాదిరికుప్పానికి చెందిన లక్ష్మిపతి, తమిళనాడు గుమ్మడిపూడికి చెందిన ముకుందన్ ఉన్నారు. రవి ఆచారి, కన్నయ్య, శేఖర్, సూర్య, వేలాయుధం, ప్రకాష్, రమేష్, మునీంద్ర, దాము, యోగేష్, చంద్రారెడ్డి గాయపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్సుల ద్వారా దిండివనం, విల్లుపురం ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించారు.

తెల్లదేవరపల్లి పైలెట్ ప్రాజెక్టు వద్ద గ్యాస్ లీక్

ఎన్టీఆర్, నవంబర్ 24 (జై భీమ్ న్యూస్) :

విస్సన్నపేట మండలం తెల్లదేవరపల్లి పైలెట్ ప్రాజెక్టు వద్ద గ్యాస్ లీక్ కలకలం రేపింది. మంగళవారం తెల్లవారుజాము నుంచే లీకేజీ కావడంతో పరిసర ప్రాంతాల్లో భయంకరమైన వాసన వ్యాపించింది. 500 లీటర్ల సామర్థ్యం కలిగిన క్లోరినేషన్ గ్యాస్ ట్యాంకు నుంచి లీకేజీ మొదలయింది. ఘాటైన వాసనతో అప్రమత్తమైన స్థానికులు.. అధికారులకు సమాచారం అందించారు. దాంతో అగ్నిమాపక శాఖ అధికారులు హుటాహుటిన రంగంలోకి దిగి, రెండు ఫైర్ ఇంజన్లతో ఘటనా స్థలంలో సహాయక చర్యలు ప్రారంభించారు. ఎలాంటి ప్రమాదం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. కొవ్వూరు నుంచి ప్రత్యేక రెస్క్యూ టీమ్ రానున్నట్లు అగ్నిమాపక అధికారులు వెల్లడించారు.

బల్దియాలో నెలవారీ వసూళ్ల దందా!

11 మంది ఆర్ఐల నుంచి నెలకు రూ.55 వేల వసూళ్లు

ఈఎంఐ తరహాలో ప్రతి నెలా రూ.5 వేల చెల్లింపులు

డబ్బులివ్వకుంటే ఫైళ్లు పెండింగ్‌లో పెడుతున్నారనే ఆరోపణలు

గ్రేటర్ వరంగల్, నవంబర్ 24 (జై భీమ్ న్యూస్) :

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో నెలవారీ వసూళ్ల వ్యవహారం తీవ్ర చర్చకు దారితీస్తోంది. 66 డివిజన్ల పరిధిలో విధులు నిర్వహిస్తున్న సుమారు 11 మంది రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల (ఆర్ఐలు) నుంచి ఒక్కొక్కరి వద్ద నెలకు రూ.5 వేల చొప్పున మొత్తం రూ.55 వేలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ చెల్లింపులు ఏదో ఒకసారి జరిగే వ్యవహారం కాకుండా, ప్రతి నెలా ఈఎంఐ తరహాలో తప్పనిసరిగా చెల్లించాల్సిన పరిస్థితి ఉందని ఉద్యోగ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. టాక్స్ ఆఫీసర్ పేరు ప్రస్తావిస్తూ ఆయన డ్రైవర్ ద్వారా ఈ మొత్తాన్ని పంపిస్తున్నారనే ఆరోపణలు మరింత కలకలం రేపుతున్నాయి. నెలకు రూ.5 వేల చొప్పున ఇవ్వకపోతే సంబంధిత ఆర్ఐల ఫైళ్లను పెండింగ్‌లో పెడుతున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. దీంతో విధుల నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతాయనే భయంతో ఆర్ఐలు ఈ మొత్తాన్ని చెల్లించాల్సి వస్తోందని ప్రచారం సాగుతోంది. ఈ వసూళ్లకు ఆదేశాలు ఇస్తున్నది ఎవరు? డ్రైవర్ ద్వారా సేకరిస్తున్న డబ్బులు ఎవరికి చేరుతున్నాయి? 11 మంది ఆర్ఐలు ప్రతి నెలా ఈ మొత్తాన్ని చెల్లిస్తున్నారా? అన్న అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.



వసూళ్ల ఒత్తిడి.. ప్రజలపై అదనపు భారం!

ప్రతి నెలా ఈ మొత్తాన్ని సమకూర్చుకోవాల్సిన ఒత్తిడి ఆర్ఐలను సాధారణ ప్రజల పనులపై చేతివాటం చూపించేలా చేస్తోందనే ఆరోపణలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. తమ జీతభత్యాలతో విధులు నిర్వహించాల్సిన ప్రభుత్వ ఉద్యోగులు, అదే ప్రజల నుంచి వచ్చే పన్నుల రూపంలో జీతాలు పొందుతూ, తిరిగి ప్రజల పనుల కోసం వారిపైనే అదనపు భారం మోపాల్సిన పరిస్థితి ఏర్పడితే అది తీవ్రమైన పరిపాలనా వైఫల్యమే అవుతుంది. ప్రజల నుంచి పన్నులు వసూలు చేయాల్సిన బాధ్యత కలిగిన అధికారుల వ్యవస్థలోనే ఇలాంటి నెలవారీ వసూళ్ల ఆరోపణలు రావడం బల్దియా ప్రతిష్ఠకు మచ్చగా మారుతోంది. జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న ఈ వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించి సంబంధిత 11 మంది ఆర్ఐల నుంచి రహస్యంగా వివరాలు సేకరించడంతో పాటు, డ్రైవర్ పాత్ర, ఫైళ్ల పెండింగ్‌కు సంబంధించిన రికార్డులు, నెలవారీ చెల్లింపుల ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలి. ఆరోపణలు నిర్ధారణ అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రజల పనులు సజావుగా జరగాల్సిన కార్యాలయంలో డబ్బులు చెల్లిస్తేనే ఫైళ్లు కదిలే పరిస్థితి ఉందనే ప్రచారానికి అధికారులు సమాధానం చెప్పాలి. బల్దియాలో ఈ నెలవారీ వసూళ్ల వ్యవహారానికి అడ్డుకట్ట పడుతుందా? ప్రజలపై అదనపు భారం మోపుతున్న వ్యవస్థలో బాధ్యులెవరో బయటపడతారా? అన్నది ఇప్పుడు కీలకంగా మారింది.

వంగవీటి రాధాకృష్ణ అసలు పేరు తెలుసా..

విజయవాడ మేయర్‌గా వంగవీటి రాధాకృష్ణ ప్రమాణస్వీకారం

వంగవీటి రాధాకృష్ణ అసలు పేరు వంగవీటి రాధాకృష్ణన్

ప్రమాణ స్వీకారం సమయంలో మరోసారి చర్చ జరిగింది

విజయవాడ. నవంబర్ 24 (జై భీమ్ న్యూస్) :

విజయవాడ నగర మున్సిపల్ కార్పొరేషన్ నూతన మేయర్‌గా వంగవీటి రాధాకృష్ణ ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడ అంబేద్కర్ కళావేదికలో నిర్వహించిన కార్యక్రమంలో రాధాకృష్ణతో ఎన్నికల అధికారి హోదాలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీ శా ప్రమాణం చేయించారు. ముందుగా విజయవాడ మేయర్‌గా వంగవీటి రాధాకృష్ణ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం 85మంది నగర కార్పొరేటర్లతో కలెక్టర్ లక్ష్మీ శా వరుసగా ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం విజయవాడ నగర పాలక సంస్థలో నూతన పాలకవర్గం బాధ్యతలు చేపట్టింది. ఇదిలా ఉంటే విజయవాడ మేయర్‌గా వంగవీటి ప్రమాణస్వీకారం సమయంలో అందరూ ఆయన పేరు గురించి చర్చించుకున్నారు.

వాస్తవానికి అందరూ ఆయన్ను వంగవీటి రాధాకృష్ణ అని పిలుస్తారు. ఆయన మేయర్‌గా ప్రమాణస్వీకారం చేసిన పత్రంలో మాత్రం పేరు వేరేగా ఉంది.. ఆయన తన పేరును వంగవీటి రాధాకృష్ణ అని కాకుండా వంగవీటి రాధాకృష్ణన్ అని చదివారు. ఆయనకు తల్లిదండ్రులు పెదనాన్న రాధాకృష్ణమూర్తి పేరు కలిసి వచ్చేలా పేరు పెట్టారు. అయితే ఆయన తమిళనాడులోని ఊటీ స్కూల్‌లో చదువుకునే సమయంలో అక్కడి రికార్డుల్లో ఆయన పేరును రాధాకృష్ణన్‌గా నమోదు చేశారు. అలా రికార్డుల్లో నమోదు కావడంతో రాధాకృష్ణన్‌గానే కొనసాగుతూ వస్తోంది. వివిధ సందర్భాల్లో సమర్పించిన ఎన్నికల అఫిడవిట్‌లలో సైతం రాధాకృష్ణన్‌గానే ఉంది. అంతేకాదు ఎన్నికల ప్రచార సమయంలో కూడా కొంతమంది రాధాకృష్ణన్‌గా ప్రస్తావించారు. కాబట్టి ఆయన పేరు రాధాకృష్ణ కాదు.. రాధాకృష్ణన్.

ముందుగా మేయర్ వంగవీటి రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం కార్పొరేటర్లు వారి పేర్ల ప్రకారం ప్రమాణం చేశారు.. అయితే విజయవాడ కార్పొరేషన్ 32వ డివిజన్ టీడీపీ కార్పొరేటర్ శైలజ సురభి ప్రమాణ స్వీకారానికి హాజరు కాలేదు. ఆమె అమెరికా వెళ్లడంతో హాజరుకాలేకపోయారు. మేయర్, కార్పొరేటర్ల ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత డిప్యూటీ మేయర్ ఎన్నిక ప్రక్రియను నిర్వహించారు. ఈ ఎన్నికల ప్రక్రియలో మేయర్ రాధాకృష్ణన్‌తోపాటు ఎక్స్‌అఫీషియో, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు. విజయవాడ 12వ డివిజన్ కార్పొరేటర్ చెన్నుపాటి కాంతిశ్రీని డిప్యూటీ మేయర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డిప్యూటీ మేయర్‌గా కాంతిశ్రీ పేరును కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు ప్రతిపాదించగా.. మరో కార్పొరేటర్ నందిపాటి దేవానంద్‌కుమార్ బలపరిచారు. ఆమెకు మెజార్టీ కార్పొరేటర్లు మద్దతు తెలపడంతో.. డిప్యూటీ మేయర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు కలెక్టర్ ప్రకటించారు. అనంతరం అందరూ డిప్యూటీ మేయర్ కాంతిశ్రీని అభినందించారు.

విజయవాడ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని.. నగరంలో సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తామన్నారు మేయర్ వంగవీటి రాధా. తనకు డిప్యూటీ మేయర్‌గా అవకాశం కల్పించినందుకు టీడీపీ అధిష్టానానికి, కార్పొరేటర్లకు డిప్యూటీ మేయర్ కాంతిశ్రీని ధన్యవాదాలు తెలిపారు. విజయవాడ నగరాభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యేయే అవకాశం రావడం ఆనందంగా ఉందన్నారు. మేయర్‌తో కలిసి ప్రజల సమస్యల్ని పరిష్కరిస్తామన్నారు. మేయర్, డిప్యూటీ మేయర్లతో పాటుగా కార్పొరేటర్లను విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని అభినందించారు. మేయర్, డిప్యూటీ మేయర్, ఎన్నికైన సభ్యులంతా విజయవాడ నగర అభివృద్ధి కోసం కృషి చేస్తారని.. నగరానికి పూర్వ వైభవం తీసుకొస్తామనే నమ్మకం ఉందన్నారు.

సింగరేణి కాంట్రాక్టు కార్మికుల పిల్లలకు సింగరేణి విద్యాసంస్థల్లో ఉచిత విద్య



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో సింగరేణి యాజమాన్యం నిర్ణయం

సుమారు 30 వేల మంది కాంట్రాక్టు కార్మికుల కుటుంబాలకు ప్రయోజనం

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో.. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సంక్షేమం దిశగా సింగరేణి యాజమాన్యం మరో కీలక నిర్ణయం తీసుకుంది. సంస్థ పరిధిలోని 12 ఏరియాల్లో పనిచేస్తున్న సుమారు 30 వేల మంది కాంట్రాక్టు కార్మికుల పిల్లలకు సింగరేణి పాఠశాలల్లో ఉచిత విద్య అందించాలని నిర్ణయించింది. ఇటీవల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అధ్యక్షతన జరిగిన కోల్ బెల్ట్ ప్రాంత ప్రజా ప్రతినిధుల సమావేశంలో కాంట్రాక్టు కార్మికుల సంక్షేమం కోసం తీసుకున్న నిర్ణయాల్లో భాగంగా ఉచిత విద్యను ప్రవేశపెట్టడం విశేషం. ప్రస్తుతం సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలోని 9 పాఠశాలల్లో చదువుతున్న 400 మంది పిల్లలకి తక్షణమే ఇది వర్తించనుంది. వచ్చే సంవత్సరం నుంచి వీరితో పాటు కొత్తగా చేరబోయే కాంట్రాక్టు కార్మికుల పిల్లలకి కూడా ఈ సౌకర్యం వర్తించనుంది. నిర్ణయం వల్ల ఎక్కువ సంఖ్యలో కాంట్రాక్టు కార్మికులు తమ పిల్లలను సింగరేణి విద్యా సంస్థల్లో చేర్పించే అవకాశం ఉంది. సింగరేణి యాజమాన్యం తీసుకున్న ఈ నిర్ణయం కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికుల కుటుంబాలకు ఆర్థికంగా ఊరటనివ్వనుంది. సింగరేణి పాఠశాలల్లో తమ పిల్లలకు ఉచితంగా నాణ్యమైన విద్య అందించే అవకాశం కలగడం పట్ల కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కార్తీక పౌర్ణమి పర్వదినం

రాష్ట్ర ప్రజలందరికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు

చీకట్లను తొలగించి జ్ఞాన జ్యోతులను వెలిగించే పవిత్ర కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆధ్యాత్మిక వెలుగులు నింపి, శుభాలు, సుఖసంతోషాలు కలిగించాలని ఆకాంక్షించారు. అజ్ఞానమనే అంధకారాన్ని తొలగించి, ఆత్మజ్ఞానమనే దివ్యజ్యోతిని హృదయాల్లో వెలిగించే కార్తీక పౌర్ణమి పుణ్యవేళలో భక్తిశ్రద్ధలతో పరమశివుడిని ఆరాధిస్తూ, దీపారాధనతో దైవ చైతన్యాన్ని నింపుకోవాలని ముఖ్యమంత్రి కోరారు. పరమేశ్వరుని కరుణాకటాక్షాలు, దివ్యాశీస్సులు ప్రజలందరిపై సదా ఉండాలని, ప్రతి ఇంటా ఆయురారోగ్యాలు, శాంతి, సౌభాగ్యం, సిరిసంపదలు వెల్లివిరియాలని అభిలషించారు.

మునగ స్త్రీలకు ఎంతో మేలు చేస్తుంది



మన దేశంలో మునగ ప్రయోజనాలను పొందడంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవు..? ఇది అందరికీ తెలిసిన విషయమే.. సులువుగా లభించే మునగకాయలను అందరూ ఇష్టపడతారు.గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంట్లో మునగ చెట్టు ఉంటుంది. ఒక్కొక్కరు ఒక్కో రకంగా వాటి నుంచి లభించే మునగకాయలను తింటారు. మునగ రుచి, ఆరోగ్య ప్రయోజనాలు ప్రజలను ఆకర్షిస్తాయి. అయితే.. మునగలో ఉండే విటమిన్ సి, యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు దగ్గు, జలుబును నివారిస్తాయి. అంతేకాదు, క్యాల్షియం , ఐరన్ మునగలో పుష్కలంగా ఉంటాయి. మగవారికి మునగతో చేసిన వంటకాలు తినాలని చెబుతుంటారు. అయితే.. ఇది మగవారికే కాకుండా.. మహిళలకు కూడా ఎంతో ప్రయోజనాలను కల్గిస్తుంది. మునగలో గర్భిణీ స్త్రీలకు అవసరమైన నియాసిన్, రిబోఫ్లావిన్ , విటమిన్ బి12 వంటి బి విటమిన్లు కూడా ఉన్నాయి. మునగాలోని యాంటీబయాటిక్ ఏజెంట్లు రక్త ప్రసరణను మెరుగుపరచడంలో సహాయపడతాయి. అలాగే, మునగలో జింక్ ఉంటుంది, ఇది చర్మ సంరక్షణకు చాలా మంచిది. గ్లుటాతియోన్ చర్యను వేగవంతం చేసే లక్షణాలను కూడా మునగ కలిగి ఉంది. శరీరంలో మొటిమలు ఏర్పడటాన్ని తగ్గిస్తుంది. మునగ ఆకు రసం చర్మాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. పాలిచ్చే తల్లులు పాల సరఫరాను పెంచడానికి మునగను ఉపయోగిస్తారు. అంతే కాకుండా మురిపంలో ఉండే పొటాషియం, ఐరన్, కాల్షియం, విటమిన్ సి, బి, బీటా కెరోటిన్ , అమినో యాసిడ్స్ తల్లి పాలను పెంచడంలో సహాయపడతాయి. మునగ కొవ్వు తగ్గడానికి , బరువు తగ్గడానికి సహాయపడుతుంది. మునగలో ఫైబర్ , మోనోశాచురేటెడ్ ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉన్నాయి. ఇవి ఆకలిని అదుపులో ఉంచుతాయి. ఉసిరి ఆకులతో నీరు తాగడం వల్ల కూడా రుతు నొప్పి తగ్గుతుంది. ఉసిరికాయ ఆకులతో నీటిని మరిగించి రోజూ తాగడం వల్ల కొలెస్ట్రాల్ అదుపులో ఉంటుంది. ఇది కాకుండా, మునగా యొక్క హెపాటోప్రొటెక్టివ్ ఫంక్షన్ కాలేయాన్ని రక్షించడానికి , టాక్సిన్స్ నుండి రక్షించడానికి సహాయపడుతుంది. శరీరంలోని క్యాలరీల పరిమాణాన్ని తగ్గించడంలో కూడా మునగ మంచిది. మునగ లైంగిక ఉద్దీపనలో కూడా సహాయపడుతుంది. మునగలో ఉండే కామోద్దీపన సమ్మేళనం టెస్టోస్టెరాన్ స్థాయిలను పెంచుతుంది. ఆహారంలో మునగ పువ్వును చేర్చుకోవడం కూడా స్పెర్మ్ కౌంట్ పెంచడంలో సహాయపడుతుంది.

గర్భిణులు కాఫీ తాగొచ్చా?




గర్భధారణ సమయంలో జీవనశైలి, ఆహారపు అలవాట్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. కాబోయే తల్లులలో తరచుగా తలెత్తే ప్రశ్న ఏమిటంటే కాఫీ తాగడం మంచిదేనా అని. ముఖ్యంగా కెఫీన్ కంటెంట్ కారణంగా వారి శిశువు మెదడు అభివృద్ధికి సురక్షితమేనా అనే ప్రశ్నలు కూడా తలెత్తుతుంటాయి. కెఫీన్ ఎక్కువగా తీసుకోవడం వల్ల పిండంపై ఎలాంటి ప్రభావం ఉంటుంది? కాఫీ అనేది కెఫిన్ ప్రసిద్ధ మూలం. ఇది కేంద్ర నాడీ వ్యవస్థను ప్రభావితం చేస్తుంది. మితమైన మొత్తంలో కెఫిన్ చాలా మందికి సురక్షితంగా పరిగణిస్తుంటారు. గర్భధారణ సమయంలో తల్లి ఏది తిన్నా అది కడుపులో పెరుగుతున్న బిడ్డపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుందని చెబుతున్నారు వైద్యులు. గర్భిణీ స్త్రీలు కెఫిన్ చాలా నెమ్మదిగా జీర్ణం కావడమే దీనికి కారణం. రక్తప్రవాహంలో ఎక్కువసేపు ఉంటుంది. కెఫీన్‌ను సమర్థవంతంగా విచ్ఛిన్నం చేయడానికి అవసరమైన ఎంజైమ్‌లు పిండంలో లేనందున బిడ్డపై ప్రభావం చూపుతుందంటున్నారు. కెఫిన్ వినియోగం పిండం మెదడు అభివృద్ధిని ఎలా ప్రభావితం చేస్తుంది? గర్భధారణ సమయంలో అధిక కెఫిన్ శిశువు మెదడు అభివృద్ధికి ఆటంకం కలిగిస్తుంది. ఇది భవిష్యత్ పలు సమస్యలకు దారి తీసేలా ఉంటుంది. న్యూరోఫార్మకాలజీలో ప్రచురించిన పరిశోధన ప్రకారం.. చాలా కెఫిన్ మెదడు సర్క్యూట్లకు అంతరాయం కలిగిస్తుందని సూచిస్తుంది. కొన్ని అధ్యయనాలు గర్భంలో అధిక స్థాయిలో కెఫిన్‌కు గురయ్యే శిశువులకు అటెన్షన్ డిజార్డర్స్, హైపర్యాక్టివిటీ వంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని సూచిస్తున్నాయి. అయినప్పటికీ, ఈ ప్రమాదాలు ప్రధానంగా అధిక కెఫిన్ వినియోగంతో ముడిపడి ఉన్నాయని డాక్టర్ విష్ణోయ్ చెబుతున్నారు.

ఉప్పు తినడం పూర్తిగా మానేశారా?



ఒక హెల్తీ అడల్ట్ రోజుకు 4 గ్రాముల కంటే ఎక్కువ ఉప్పు తినకూడదని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక తెలిపింది. అలాగని ఉప్పు పూర్తిగా మానేయకూడదు అంటున్నారు నిపుణులు. అయితే 30 రోజులు సాల్ట్ తినడం మానేస్తే ఏమవుతుందో ఇప్పుడు మనం తెలుసుకునే ప్రయత్నం చేద్దాం. బరువు తగ్గుతారు : ఉప్పు తినడం ఆపేస్తే బరువు తగ్గుతారు అంటున్నారు నిపుణులు. ఒక నెల పాటు సాల్ట్ తినకపోతే శరీరం తక్కువ సోడియంకు అడ్జస్ట్ అవడం మొదలు అవుతుంది దీంతో సోడియం లెవెల్స్ డ్రాప్ అవుతాయి. ఆ పరిస్థితులకు శరీరం సర్దుకుంటుంది కూడా. సాధారణంగా సోడియం నీటి శాతాన్ని హోల్డ్ చేయడానికి సహాయపడుతుంది. శరీరంలో అది ఎక్కువ లేకపోతే నీటి శాతం తగ్గుతుంది కాబట్టి వెయిట్ లాస్ అవుతారు. సాల్టీ ఫుడ్స్‌లో చాలా కేలరీలు ఉంటాయి. వీటికి దూరంగా ఉంటే కేలరీల ఇన్‌టెక్ తగ్గి బరువు తగ్గుతారు. ఎందుకంటే సాల్టీ ఫుడ్స్ మానేస్తే హెల్తీ ఫుడ్స్ తింటాం కాబట్టి శరీరంలోని, ముఖ్యంగా కడుపు, నడుము చుట్టూ ఉన్న కొవ్వు తగ్గడానికి స్కోప్ ఉంటుంది. బ్లోటింగ్ వంటి సమస్యలకు గుడ్ బాయ్ చెప్పవచ్చు. అయితే, చాలా త్వరగా బరువు తగ్గితే ఆరోగ్యానికి హానికరం అని మాత్రం గుర్తు పెట్టుకోండి.జీర్ణ సమస్యలు : ఉప్పు డైజెషన్‌కు కూడా అవసరమే. ఉప్పులోని సోడియం స్టమక్ యాసిడ్ తయారు కావడానికి అవసరం. సడన్‌గా సాల్టిపుట్స్ మానేస్తే డైజెస్టివ్ సిస్టమ్ అడ్జస్ట్ అవదు. సాల్ట్‌కు బదులు ఫైబర్-రిచ్ ఫ్రూట్స్ వంటివి తింటే వాటిని అరిగించుకోవడానికి డైజెస్టివ్ సిస్టమ్‌కు కష్టమైపోతుంది. దీంతో కడుపు నొప్పి, ఇతర అజీర్తి సమస్యలు వస్తాయి అంటున్నారు నిపుణులు. మానసిక ఆరోగ్యం: ఉప్పును పూర్తిగా మానేస్తే బ్రెయిన్ మీద ప్రభావం పడే అవకాశం ఉంటుంది. ఇది ఒత్తిడి, ఆందోళన వంటి మానసిక సమస్యలకు దారితీస్తుంది. సోడియం శరీరంలోని ఫ్లూయిడ్స్ మెయింటెన్ చేయడానికి అవసరం. ఇది నాడీ వ్యవస్థ పనితీరుకు కూడా ముఖ్యం. సోడియం తక్కువైతే నాడీ కణాల మధ్య కమ్యూనికేషన్ సరిగ్గా జరగక మూడ్ పాడవుతుంది.

ఈ కాయతో బోలెడన్నీ ప్రయోజనాలు



చేదు ఆరోగ్యానికి మంచి అని తెలిసిన కూడా చాలా మంది తినడానికి ఇష్టపెట్టుకోరు. చేదుగా ఉండే పదార్థాల జోలికి అసలు దగ్గరగా ఉండరు.చేదుగా ఉండే పదార్థాలకు కిలోమీటరు దూరంలో ఉంటారు. అయితే కూరగాయాల్లో కాకరకాయ చేదుగా ఉంటుంది. అసలు దీనిని తినడానికి ఎవరూ ఇష్టపడరు. కాకరకాయను ఎలా వండిన కూడా చేదుగా ఉంటుంది. కనీసం ఏడాదికి కూడా ఒక్కసారి కూడా వీటిని తినరు. ఇందులోని పోషకాలు శరీర ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. ఈ కాకరకాయను వారానికి ఒకసారి అయిన తినడం వల్ల అనారోగ్య సమస్యలు బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటారని వైద్య నిపుణులు చెబుతున్నారు. దీనిని డైలీ తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో బాగా ఉపయోగపడుతుంది. ఇవే కాకుండా వ్యాధికారక ప్రమాదాల నుంచి కాపాడటంలో కాకరకాయలు ముఖ్య పాత్ర పోషిస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల ఇవే కాకుండా ఇంకా బోలెడన్నీ ప్రయోజనాలు ఉన్నాయి. మరి ఈ ప్రయోజనాలేంటో తెలియాలంటే ఆలస్యం చేయకుండా ఈ ఆర్టికల్‌పై ఓ లుక్కేయండి. కాకరకాయలో ఎక్కువగా పాలీపెప్టైడ్-పి అనే ఇన్సులిన్ వంటి సమ్మేళనాలు ఉన్నాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో బాగా సహాయపడతాయి. కాకరకాయ మధుమేహం ఉన్నవారి ఆరోగ్యానికి చాలా మంచిది. ఇందులో ఫైబర్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. ఇది మలబద్ధకం వంటి సమస్యల నుంచి కాపాడుతుంది. చేదు అనారోగ్య వ్యాధుల నుంచి కాపాడుతుంది. ఇందులోని పోషకాలు చర్మ ఆరోగ్యాన్ని మేలు చేస్తాయి. అలాగే ఈ కాకరకాయ మొక్క ఆకులను పేస్ట్ చేసి తలకు అప్లై చేస్తే చుండ్రు తగ్గుతుంది. చేదు వల్ల తలలో పేలు వంటివి ఉన్న కూడా మాయమైపోతాయి. మీకు నచ్చిన విధంగా కాకరకాయను వండి తినడం వల్ల తలనొప్పి నుంచి విముక్తి పొందుతారు. దీనిని తినలేమని అనుకునేవారు జ్యూస్ చేసి కూడా తాగవచ్చు. దీని జ్యూస్ తాగితే కిడ్నీ సమస్యలు, మోకాలి నొప్పులు తొందరగా తగ్గుతాయి. ఎలాంటి ఆపరేషన్, మందులు వాడకుండా కిడ్నీలోని రాళ్ల సమస్యలను తగ్గించవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. కొందరు మైగ్రేన్ సమస్యతో బాధపడుతుంటారు. ఎన్ని మందులు వాడిన ఈ సమస్య తగ్గదు. అలాంటి వారు కాకరకాయ ఆకలను మెత్తగా చేసి దానిని నుదిటిపై రాస్తే.. క్షణాల్లో తలనొప్పి నుంచి విముక్తి పొందుతారు.

పచ్చి ఉల్లిపాయల ప్రయోజనాలు



మన వంటింట్లో దొరికే కూరగాయలలో ఉల్లిపాయ కూడా ఒకటి. ఈ ఉల్లిపాయ వల్ల ఎన్నో రకాల లాభాలు ఉన్నాయి అన్న విషయం మనందరికీ తెలిసిందే. ఉల్లిపాయను తరచుగా తినడం వల్ల అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. ఉల్లి చేసే మేలు అంతా ఇంతా కాదు. అందుకే ఉల్లి చేసే మేలు తల్లి కూడా చేయదని అంటూ ఉంటారు. అయితే కొందరు పచ్చి ఉల్లిపాయలు తింటే మరి కొందరు కూరల్లో తినడానికి ఇష్టపడుతూ ఉంటారు. మనలో చాలామంది పచ్చి ఉల్లిపాయ తినడానికి అసలు ఇష్టపడరు. కానీ చాలా మందికి తెలియని విషయం ఏమిటంటే ఉల్లిపాయ వల్ల ఎన్నో రకాల ప్రయోజనాలు కలుగుతాయట. మరి పచ్చి ఉల్లిపాయ తింటే ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయో ఇప్పుడు మనం తెలుసుకుందాం.. పచ్చి ఉల్లిపాయల్లో మన శరీరానికి అవసరమైన విటమిన్ సి, విటమిన్ బీ6, కాల్షియం, ఫాస్పరస్, పొటాషియం వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అలాగే పచ్చి ఉల్లిపాయల్లో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి మన శరీరంలో ఉండే ఫ్రీ రాడికల్స్ తో పోరాడటానికి సహాయపడతాయి. అలాగే ఎన్నో రోగాల ప్రమాదాన్ని కూడా తగ్గిస్తాయని చెబుతున్నారు. పచ్చి ఉల్లిపాయలలో యాంటి క్యాన్సర్ లక్షణాలు కూడా ఉంటాయి. అంటే వీటిని మోతాదులో తింటే క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల ప్రమాదం తగ్గుతుందని కొందరు ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అలాగే పచ్చి ఉల్లిపాయ డయాబెటిక్ పేషెంట్లకు కూడా ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందట. ఎలా అంటే మధుమేహులు పచ్చి ఉల్లిపాయలను తింటే రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయని చెబుతున్నారు. పచ్చి ఉల్లిపాయలను తింటే శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలు నార్మల్ గా ఉంటాయట. దీంతో మీ గుండె ఆరోగ్యంగా ఉంటుందని, శరీరంలో కొలెస్ట్రాల్ లెవెల్స్ నార్మల్ గా ఉంటే గుండెపోటు వచ్చే ప్రమాదం తగ్గుతుందని చెబుతున్నారు. ఉల్లిపాయల్లో యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉంటాయి. అంటే వీటిని తినడం వల్ల మంట, నొప్పి నుంచి ఉపశమనం కలుగుతాయట. ముఖ్యంగా చలికాలంలో కీళ్లనొప్పుల నొప్పుల నుంచి బయటపడాలంటే పచ్చి ఉల్లిపాయలను మోతాదులో తినడం చాలా మంచిదని చెబుతున్నారు. పచ్చి ఉల్లిపాయలు తినడం వల్ల జీర్ణ సంబంధిత సమస్యలు కూడా తలెత్తవట.

పళ్ళుతోమకుంటే ఏమవుతుంది..?

చాలా మంది తమ నోటిని దేవుని ఇల్లుగా భావిస్తారు. దానిలోని దంతాలు , ఆ ఒక్క నాలుక అన్ని విధాలుగా నీతిగా , శుభ్రంగా ఉంచబడతాయి. అక్కడ స్వేచ్ఛకు అనుమతి లేదు. అయితే కొన్ని ఉన్నాయి. వారి పొడవాటి నాలుకలను వదులుకోండి. దాంతో వారు గందరగోళానికి గురవుతారు. మరికొందరు పళ్లు తోముకోవడం, శుభ్రంగా ఉంచుకోవడం వంటి పనుల జోలికి వెళ్లరు.కానీ ఆ ప్రాతిపదికన, బ్రషింగ్‌ను ఒకటి లేదా రెండు రోజులు దాటవేయడం పెద్ద విషయంగా అనిపించదు. అయినప్పటికీ, మీ దంత పరిశుభ్రతను చాలా కాలం పాటు నిర్లక్ష్యం చేయడం వలన మీ శరీరం యొక్క మొత్తం ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. నోరు మిలియన్ల బ్యాక్టీరియాలకు నిలయం. , మీరు మీ దంతాలను క్రమం తప్పకుండా బ్రష్ చేయకపోతే, బ్యాక్టీరియా సంఖ్య పెరుగుతుంది. ఇది నోటి దుర్వాసన లేదా తడిసిన దంతాల కంటే అనేక సమస్యలకు దారితీస్తుంది. బ్రష్ చేయని మొదటి కొన్ని రోజుల్లో నోటిలో తక్షణ మార్పులు సంభవిస్తాయి మీరు బ్రష్ చేయడం ఆపివేసినప్పుడు గుర్తించదగిన మొదటి మార్పు దంతాల మీద మృదువైన ఫలకం ఏర్పడటం. ఈ ఫలకం బ్యాక్టీరియాతో నిండిపోయి చిగుళ్లను చికాకుపెడుతుంది. ఇది మంటను కలిగిస్తుంది , ఈ ఎర్రబడిన చిగుళ్ళను తాకినప్పుడు లేదా సున్నితంగా బ్రష్ చేసినప్పుడు సులభంగా రక్తస్రావం అవుతుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, డెంటల్ ప్లేక్ డెంటిన్‌లో డీకాల్సిఫికేషన్‌ను ప్రారంభించే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. కాబట్టి ఈ వైవిధ్యం ఫలకం మీ దంతాలను నాశనం చేసే ముందు ఎనామెల్ కింద రక్షిత పొరపై 48 గంటలలోపు సంభవిస్తుంది.



జీరో ఆయిల్ కుకింగ్

ఎప్పుడైనా నూనె రుచి చూశారా? కచ్చితంగా నచ్చదు. కానీ నూనె వల్లే వంట రుచికరంగా ఉంటుందని నమ్ముతాం. అయితే ఆయిల్, నెయ్యి, వెన్నెకు సంబంధించిన ఒక్క చుక్క లేకుండా కూడా టేస్టీ ఫుడ్ ప్రిపేర్ చేయొచ్చని చెప్తున్నారు నిపుణులు.రుచిని త్యాగం చేయకుండా రుచికరమైన భోజనం వండొచ్చని వాగ్దానం చేస్తున్నారు. ప్రస్తుతం జీరో ఆయిల్ కుకింగ్ ట్రెండ్ అవుతుండగా.. ఈ విప్లవాత్మక విధానం, ఉపయోగాల గురించి తెలుసుకుందాం. జీరో ఆయిల్ కుకింగ్ అనేది ఎటువంటి నూనెలు లేదా కొవ్వులను ఉపయోగించకుండా ఆహారాన్ని తయారు చేయడాన్ని సూచిస్తుంది. ఈ వంట పద్ధతి స్టీమింగ్, బాయిల్ చేయడం, గ్రిల్లింగ్, రోస్ట్ చేయడం లేదా ఆహారాన్ని అంటుకోకుండా నిరోధించడానికి నాన్-స్టిక్ కుక్‌వేర్‌లను ఉపయోగించడం వంటి ప్రత్యామ్నాయాలపై ఆధారపడి ఉంటుంది. సుగంధ ద్రవ్యాలు, మూలికలు, నిమ్మకాయ, ఇతర సహజ రుచులను టేస్ట్ మెరుగుపరచడానికి ఉపయోగిస్తారు. తద్వారా నూనె అవసరం లేకుండా ఆహారాన్ని పోషకమైనదిగా, రుచిగా మారుస్తుంది. గుండె ఆరోగ్యం : నూనెను తగ్గించడం, ముఖ్యంగా అనారోగ్యకరమైన కొవ్వులు, చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది. గుండె జబ్బులు, రక్తపోటు, స్ట్రోక్స్ ప్రమాదాన్ని నివారిస్తుంది. నూనెలో సంతృప్త కొవ్వులు ఉంటాయి. ఇవి గుండెకు చాలా అనారోగ్యకరమైనవి. కాబట్టి నూనెను వాడకుండా ఉండటం ద్వారా.. ఈ సంతృప్త కొవ్వులను కూడా వదిలించుకోవచ్చు. వెయిట్ మేనేజ్మెంట్ : నూనెలో కేలరీలు ఎక్కువగా ఉన్నందునా.. మీ ఆహారం నుంచి దానిని తొలగించడం మొత్తం కేలరీల తీసుకోవడం తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది కిలోల బరువు తగ్గడానికి, వెయిట్ మేనేజ్మెంట్ కు సహాయపడుతుంది. నూనెలో కొవ్వు ఉంటుంది. అధిక కొవ్వు అధిక బరువు పెరగడానికి దారితీస్తుంది. కాబట్టి జీరో ఆయిల్ కుకింగ్ బరువు నిర్వహణలో సహాయపడుతుంది. జీర్ణక్రియ మెరుగు :భారీ, జిడ్డుగల ఆహారాలను జీర్ణం చేయడం కష్టం. అజీర్ణం, ఉబ్బరం, ఇతర జీర్ణ సమస్యలకు దారితీయవచ్చు. నూనె లేకుండా వంట చేయడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. నూనె లేకుండా, నూనె రహిత వంటకాలు చేసేందుకు కూరగాయలు, ధాన్యాలపై ఎక్కువ దృష్టి పెట్టడం వలన ఎక్కువ ఫైబర్ తీసుకునేందుకు కారణమవుతుంది. దీనివల్ల జీర్ణక్రియ సులభమవుతుంది.



జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem సమస్యలపై సమరంగా సామాన్యుడి ఆయుధంగా

పౌరాణిక యాక్షన్ థ్రిల్లర్ "ఆది రుద్రాక్ష" మూవీ గ్లిమ్స్ విడుదల

పంచ మహా శక్తులు ,మహారహస్యం, దుష్టశక్తుల మధ్య జరిగే పోరాటం నేపథ్యంలో తెరకెక్కుతున్న పౌరాణిక యాక్షన్ థ్రిల్లర్ 'ఆది రుద్రాక్ష'. షేక్ మహబూబ్ బాషా నిర్మాణంలో, ఆర్యన్ రచన, దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా తొలి గ్లిమ్స్‌ను హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోలో విడుదల చేశారు. సినిమా గ్లిమ్స్‌లో వినిపించిన వాయిస్ ఓవర్ ఆసక్తికరంగా సాగింది. నాగ, గజ, వ్యాఘ్రు, మయూర తదితర శక్తుల ప్రస్తావనతో పాటు, యుగయుగాలుగా ఓ మహారహస్యానికి రక్షణగా నిలిచిన పంచరక్షకుల కథను పరిచయం చేశారు. ఆ రహస్యాన్ని చేజిక్కించుకోవడానికి ప్రయత్నించే దుష్టశక్తులు, వాటిని ఎదుర్కొనే మహావీరుడి నేపథ్యంలో కథ సాగనున్నట్లు గ్లిమ్స్ ద్వారా వెల్లడించారు. మహాదేవుని సంకల్పానికి ప్రతిరూపంగా ఓ వీరుడు రణరంగంలోకి అడుగుపెట్టే సన్నివేశాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా దర్శకుడు ఆర్యన్ మాట్లాడుతూ.. కార్తీక పౌర్ణమి పర్వదినం రోజున తమ సినిమా గ్లిమ్స్ విడుదల కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తాను ఎంతో ఇష్టపడి రాసుకున్న కథను వెండితెరపైకి తీసుకొస్తుండటం సంతోషాన్నిస్తోందని చెప్పారు. సినిమా గ్లిమ్స్‌ను ప్రముఖ నటుడు విజయ్ ఆంటోని గారు వీక్షించి, అభినందించడం తమ చిత్రబృందానికి మరింత ఉత్సాహాన్నిచ్చిందని తెలిపారు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించి ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించేలా సినిమాను రూపొందిస్తామని పేర్కొన్నారు. నిర్మాత షేక్ మహబూబ్ బాషా మాట్లాడుతూ.. 'ఆది రుద్రాక్ష' చిత్రానికి అండగా నిలుస్తూ సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. దర్శకుడు ఆర్యన్ అద్భుతమైన కథను సిద్ధం చేశారని, కథపై ఆయనకున్న స్పష్టత, అంకితభావం తమను ఎంతగానో ఆకట్టుకున్నాయని చెప్పారు. చిత్రాన్ని మంచి నాణ్యతతో ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి అందరం సమష్టిగా కృషి చేస్తున్నామని అన్నారు. హీరోయిన్ రూప మాట్లాడుతూ.. ఆర్యన్ చెప్పిన కథ తనకు ఎంతో నచ్చిందని, ఇందులో భాగమయ్యే అవకాశం కల్పించినందుకు దర్శకనిర్మాతలకు కృతజ్ఞతలు తెలిపారు. మంచి కథతో రూపొందుతున్న ఈ సినిమాలో నటించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. చిత్ర యూనిట్ సభ్యులు నవీన్, సందీప్, శ్రీనివాస్ మాట్లాడుతూ.. 'ఆది రుద్రాక్ష' కథాంశం ఎంతో ఆసక్తికరంగా, ప్రత్యేకంగా ఉందని అన్నారు. దర్శకుడు ఆర్యన్ ఆలోచనను తెరపై అద్భుతంగా ఆవిష్కరిస్తున్నారని తెలిపారు. చిత్రబృందంలోని ప్రతి ఒక్కరి సహకారంతో, పరమశివుడి ఆశీస్సులతో ఈ సినిమా ప్రేక్షకుల ఆదరణ పొందుతుందనే నమ్మకం వ్యక్తం చేశారు. ఆర్యన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో పౌరాణిక అంశాలు, మహాశక్తులు, యాక్షన్ సన్నివేశాల మేళవింపుతో కథను రూపొందిస్తున్నారు. విజువల్ ఎఫెక్ట్స్‌కు ప్రత్యేక ప్రాధాన్యమిస్తూ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం తొలి గ్లిమ్స్‌తోనే ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచింది.



బండ్ల గణేశ్ కు భారీ ఊరట.. రూ.95 లక్షల చెక్ బౌన్స్ కేసు సుఖాంతం!

టాలీవుడ్ నిర్మాత, నటుడు బండ్ల గణేశ్ కు సంబంధించిన రూ. 95 లక్షల చెక్ బౌన్స్ కేసు వివాదం సుఖాంతమైంది. తమ మధ్య ఉన్న వివాదం పూర్తిగా సమసిపోయిందని ఈ కేసులో ఫిర్యాదుదారుడైన జెట్టి వెంకటేశ్వరరావు స్వయంగా వెల్లడించడం గమనార్హం. ఈ మేరకు ఆయన ఓ వీడియో సందేశాన్ని విడుదల చేస్తూ వివరాలను పంచుకున్నారు. కేసు వివరాల్లోకి వెళితే... గతంలో ప్రకాశం జిల్లా మద్దిరాల-ముప్పాళ్లకు చెందిన జానకిరామయ్య వద్ద బండ్ల గణేశ్ రూ. 95 లక్షలు తీసుకున్నారు. జానకిరామయ్య మరణం తర్వాత ఆయన తండ్రి జెట్టి వెంకటేశ్వరరావుకు బండ్ల గణేశ్ తన పరమేశ్వర ఆర్ట్స్ పేరిట చెక్ ఇచ్చారు. అయితే ఖాతాలో తగినంత నగదు లేక ఆ చెక్ బౌన్స్ కావడంతో వెంకటేశ్వరరావు ఒంగోలు కోర్టును ఆశ్రయించారు. ఈ కేసును విచారించిన ఒంగోలు న్యాయస్థానం బండ్ల గణేశ్ ను దోషిగా తేలుస్తూ ఏడాది సాధారణ జైలు శిక్షతో పాటు రూ. 95 లక్షల జరిమానా, బాధితుడి కోర్టు ఖర్చులు చెల్లించాలని తీర్పునిచ్చింది. ఈ తీర్పు అనంతరం జెట్టి వెంకటేశ్వరరావు తాజాగా వీడియో విడుదల చేస్తూ కీలక విషయాలు వెల్లడించారు. "తమ మధ్య ఉన్న చిన్నపాటి వివాదాన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది కావాలనే అపార్థాలు సృష్టించి, లేనిపోని తప్పుడు ప్రచారం చేశారు" అని ఆయన పేర్కొన్నారు. గతంలో తమ కుమారుడు, బండ్ల గణేశ్ ఎంతో స్నేహంగా ఉండేవారని... కుమారుడి మరణం తర్వాత ఇగో కారణంగానో లేదా మధ్యవర్తుల ప్రమేయం వల్లనో చిన్నపాటి మనస్పర్థలు వచ్చి కోర్టు కేసుల వరకు దారితీశాయని వివరించారు. ప్రస్తుతం ఇరుపక్షాల మధ్య విభేదాలు తొలగిపోయాయని, బండ్ల గణేశ్ తో తన స్నేహం, అనుబంధం గతంలో లాగే కొనసాగుతాయని వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. దీంతో గత కొద్ది రోజులుగా తీవ్ర చర్చనీయాంశమైన ఈ చెక్ బౌన్స్ వివాదానికి తెరపడింది.



ఘనంగా 'వాషింగ్టన్ సుందర్' సినిమా టీజర్ లాంచ్

ఎస్.ఎస్. మూవీ కార్పొరేషన్ (గ్రూ ఓనీలతివ అనీతీజూనీతీజీబితినీని) బ్యానర్‌పై సత్య వినుగొండ హీరోగా నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం 'వాషింగ్టన్ సుందర్'. ఈ సినిమాలో శీతల్ భట్, అనూశ్రీ రాయ్ కథానాయికలుగా నటిస్తుండగా, 'బలగం' సంజయ్ (విలన్‌గా), 'జాతిరత్నాలు' ప్రేమ్ కుమార్, మురళీధర్ గౌడ్, సమ్మెట గాంధీ, నరేన్, నాగమహేష్, దేవ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధమైన ఈ చిత్ర ప్రమోషన్లలో భాగంగా, సోమవారం (నవంబర్ 23) హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్ వేదికగా 'వాషింగ్టన్ సుందర్' టీజర్ లాంచ్ కార్యక్రమాన్ని గ్రాండ్‌గా నిర్వహించారు ఈ కార్యక్రమంలో హీరో, దర్శకుడు, నిర్మాత సత్య వినుగొండ మాట్లాడుతూ.. "సినిమా అంటే నాకు ఎంతో ప్యాషన్. నేను ఇప్పటివరకు మూడు సినిమాలు చేశాను. మొదటి రెండు సినిమాల పేర్లు జనాలకు అంతగా తెలియకపోవచ్చు కానీ, ఈ మూడో సినిమా 'వాషింగ్టన్ సుందర్' మాత్రం ప్రతి ఒక్కరికీ గుర్తుండిపోతుంది. నిర్మాతగా, దర్శకుడిగా, హీరోగా మూడు బాధ్యతలను ఒకేసారి మోయడం అంత సులభం కాదు. క్వాలిటీ విషయంలో ఎక్కడా రాజీ పడకుండా, రోజూ ఉదయం 4 గంటలకే నిద్రలేచి 150 కిలోమీటర్ల దూరం ప్రయాణించి మరీ టీమ్ అంతా ఎంతో కష్టపడి ఈ చిత్రాన్ని పూర్తి చేశాం. ఈ సినిమా కోసం అనిల్ రావిపూడి, అనుదీప్ కె.వి., ' వేణు ఉడుగుల, శివ నిర్వాణ, హరీష్ శంకర్ వంటి దర్శకులు నన్ను ఆశీర్వదించి ఎంతో సపోర్ట్ చేశారు. అలాగే గుంటూరుకు చెందిన నన్ను జోగిపేటలో సొంత మనిషిలా ఆదరించి సహకరించిన ప్రేమ్ కుమార్, అంజన్న, సంతోష్ అన్నలకు ప్రత్యేక కృతజ్ఞతలు. సంగీత దర్శకుడు నందన్ రాజ్ బొబ్బిలి నాకు సొంత అన్నలా అండగా నిలబడి, తన మ్యూజిక్‌తో సినిమాను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లారు. మా అమ్మ కోరిక మేరకే 'ఎస్.ఎస్. మూవీ కార్పొరేషన్' బ్యానర్ స్థాపించాను. కసితో పనిచేశాను, ఈ సినిమాతో తప్పకుండా విజయం సాధిస్తామనే నమ్మకం ఉంది. ఇప్పుడు విడుదలైన టీజర్ కేవలం శాంపిల్ మాత్రమే. వచ్చే నెలలో సినిమాను గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నాం. తెలుగు ప్రేక్షకులు, మీడియా మిత్రులు నన్ను, మా 'వాషింగ్టన్ సుందర్' చిత్రాన్ని ఆదరించాలని కోరుకుంటున్నాను" అని తెలిపారు. ఇంకా చిత్రయూనిట్ సభ్యులు మాట్లాడుతూ.. ఈ సినిమా ఘన విజయం సాధించాలని కోరారు. సత్య వినుగొండ, అనూశ్రీ రాయ్, శీతల్ భట్, 'బలగం' సంజయ్, 'జాతిరత్నాలు' ప్రేమ్ కుమార్, మురళీధర్ గౌడ్, సమ్మెట గాంధీ, నరేన్, నాగమహేష్, ఛత్రపతి శేఖర్, రాకెట్ రాఘవ,దేవ్ తదితరులు నటించిన ఈ చిత్రానికి.



'హే కన్నమ్మ' సినిమా ట్రైలర్ లాంచ్

యశ్వంత్, ధనశ్రీ వర్మ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న న్యూ ఏజ్ లవ్ స్టోరీ 'హే కన్నమ్మ'. శశి కుమార్ ముత్తులూరి రచన, దర్శకత్వంలో, జీ స్టూడియోస్ సమర్పణలో, దిల్ రాజు ప్రొడక్షన్స్ ఎల్ఎల్పీ బ్యానర్‌పై హర్షిత్ రెడ్డి, హన్షిత నిర్మిస్తున్నారు. ఈ సినిమా టీజర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. నవంబర్ 27న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా మేకర్స్ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. న్యూ ఏజ్ లవ్ స్టోరీగా, బ్యూటిఫుల్ ఎమోషన్స్‌తో కూడిన ఈ ట్రైలర్ సినిమాపై అంచనాలను పెంచింది.

ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో యశ్వంత్ మాట్లాడుతూ.. "అందరికీ నమస్కారం. కెమెరా వెనక పనిచేసిన నేను ఇప్పుడు ఇలా నటుడిగా నిలబడి మాట్లాడటం చాలా కొత్తగా ఉంది. మూవీ ఇండస్ట్రీలోకి వెళ్లాలనే కలతో హైదరాబాద్ వచ్చాను. ఈ జర్నీలో నాకు చాలా మంది సపోర్ట్ చేశారు. అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. చిన్న స్క్రీన్ నుంచి ఇప్పుడు పెద్ద స్క్రీన్‌లోకి వస్తున్నాను. మా టీమ్ అందరికీ మీరు సపోర్ట్ చేస్తారని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. దిల్ రాజు గారు నన్ను ఆఫీసుకు పిలిచి, ఒక మ్యూజికల్ డాన్స్ సినిమా చేస్తున్నాం.. నువ్వే హీరో అని చెప్పగానే షాక్ అయ్యాను. తర్వాత డైరెక్టర్ శశితో కలిశాను. అప్పటినుంచి మా జర్నీ మొదలైంది. ఈ కథ మనందరి జీవితాల్లో జరిగే పరిస్థితులకు దగ్గరగా ఉంటుంది. అందరికీ కనెక్ట్ అయ్యే స్టోరీ. ఈ సినిమా చేస్తూ చాలా ఎంజాయ్ చేశాను. నాకు ఈ అవకాశం ఇచ్చిన దిల్ రాజు గారికి ధన్యవాదాలు. నాలో హర్ష క్యారెక్టర్‌ను చూసుకున్న మా డైరెక్టర్‌కు థాంక్యూ. మా టెక్నీషియన్స్ అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. వెంకటేష్ తో కలిసి నటించడం చాలా హ్యాపీగా ఉంది. నవంబర్ 27న సినిమా రిలీజ్ అవుతోంది. మీరందరూ తప్పకుండా సపోర్ట్ చేస్తారని కోరుకుంటున్నాను."

డైరెక్టర్ శశి కుమార్ మాట్లాడుతూ.. "అందరికీ నమస్కారం. చిన్నప్పటి నుంచి సినిమాల్లోకి రావాలనేది నా డ్రీమ్. నేను చేసిన ఒక షార్ట్ ఫిల్మ్ చూసి దిల్ రాజు గారు నాకు ఆపర్చునిటీ ఇచ్చారు. దిల్ రాజు గారితో సినిమా చేయడం ఎవరికైనా ఒక డ్రీమ్. ఆ డ్రీమ్ ఈరోజు నిజమైంది. ప్రొడక్షన్ హౌస్ నుంచి నాకు ది బెస్ట్ సపోర్ట్ ఇచ్చారు. నాకు ఎప్పటినుంచో ఒక యూత్‌ఫుల్ రొమాన్స్ సినిమా చేయాలని, మంచి మ్యూజికల్ లవ్ స్టోరీ చేయాలని ఉండేది. అందుకే ఈ సినిమా చేశాను. ఆరు పాటలు వచ్చేలా మొత్తం కాన్సెప్ట్‌ను సెట్ చేసి ఈ సినిమాను తెరకెక్కించాం. థియేటర్‌లో సినిమా ఒక కాన్సర్ట్‌లా ఉంటుంది. ఈ సినిమాలో మ్యూజిక్ చాలా కీలకం. మంచి మ్యూజికల్ సీక్వెన్స్‌లు ఉంటాయి. మ్యూజిక్‌తోనే కథ చెప్పాం. డాన్సర్‌గా యశ్వంత్ మీ అందరికీ తెలుసు. కానీ నేను రాసిన క్యారెక్టర్‌కు 100 శాతం పెర్ఫార్మెన్స్ ఇచ్చాడు. ధనశ్రీ కూడా చాలా బ్యూటిఫుల్‌గా యాడ్ అయింది. వెంకటేష్ కూడా అద్భుతంగా పెర్ఫార్మ్ చేశారు. ఈ సినిమా చూసినప్పుడు మనసు బరువెక్కుతుంది.. తేలికపడుతుంది. ఇది నా ప్రామిస్. మా టెక్నీషియన్స్ అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. మ్యూజిక్ ఇచ్చిన కార్తీక్ గారికి థాంక్యూ. ఈ సినిమాలోని పాటలన్నీ గుర్తుండిపోయేలా ఉంటాయి. సినిమా మీ అందరి మనసులను హత్తుకుంటుంది."



హీరోయిన్ కార్తీక మాట్లాడుతూ.. "అందరికీ నమస్కారం. ఈ సినిమాను చాలా ప్రేమతో, కష్టపడి చేశాం. దీని వెనుక చాలామంది హార్డ్ వర్క్ ఉంది. ఎన్నో కలలు ఉన్నాయి. మా కలలు నిజమవుతున్నందుకు నాకు చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమాలో ప్రతి మూమెంట్‌ను చాలా ఎంజాయ్ చేశాం. మేము ఈ సినిమాను ఎంత ప్రేమతో చేశామో, మీరు కూడా అంతే ప్రేమను అందిస్తారని కోరుకుంటున్నాను."

హీరోయిన్ ధనశ్రీ మాట్లాడుతూ.. "ఇది చాలా అద్భుతమైన కథ. ఈ సినిమా చేసినందుకు చాలా ఆనందంగా ఉంది. యశ్వంత్ ఎంతో సపోర్ట్ చేశారు. రామ్ గారు చాలా బ్యూటిఫుల్ విజువల్స్ ఇచ్చారు. మా డైరెక్టర్ అద్భుతమైన కథ రాశారు. ఈ సినిమా తప్పకుండా మీ అందరికీ గుర్తుండిపోతుంది. నవంబర్ 27న అందరూ ఈ సినిమాను థియేటర్స్‌లో చూడాలని కోరుకుంటున్నాను."

డీవోపీ రామ్ మాట్లాడుతూ.. "అందరికీ నమస్కారం. మాకు ఈ అవకాశం ఇచ్చినందుకు వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. మీ అందరినీ అలరిస్తుంది. విజువల్ స్టోరీ టెల్లింగ్ పరంగా కొత్త అనుభూతిని ఇస్తుంది. మీ అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను." ఈ వేడుకలో సినిమా యూనిట్ అందరూ పాల్గొన్నారు.

నటీనటులు: యశ్వంత్, కార్తిక మురళీధరన్, ధనశ్రీ వర్మ, వెంకటేష్ కాకుమాను, బ్రహ్మాజీ తదితరులు

ఆసియా-పసిఫిక్ టాప్ 10 రియల్ ఎస్టేట్ పెట్టుబడి కేంద్రాల్లో ముంబై: కొలియర్స్ నివేదిక

కొలియర్స్ '2027 గ్లోబల్ ఇన్వెస్టర్ ఔట్‌లుక్' నివేదిక వెల్లడి

జాబితాలో తొలి మూడు స్థానాల్లో టోక్యో, ఒసాకా, సిడ్నీ

నవీ ముంబై ఎయిర్‌పోర్ట్, ట్రాన్స్ హార్బర్ లింక్‌తో పెరిగిన డిమాండ్

దేశీయ రియల్టీ పెట్టుబడుల్లో 37 శాతానికి చేరిన ఆఫీస్ స్పేస్ వాటా

హాస్పిటాలిటీ, డేటా సెంటర్లలో 7 రెట్లు పెరిగిన పెట్టుబడులు

అంతర్జాతీయ రియల్ ఎస్టేట్ పెట్టుబడులకు సంబంధించి భారత వాణిజ్య రాజధాని ముంబై సరికొత్త రికార్డు సృష్టించింది. ఆసియా-పసిఫిక్ (ఏపీఏసీ) ప్రాంతంలో విదేశీ పెట్టుబడులకు (క్రాస్-బోర్డర్ ఇన్వెస్ట్‌మెంట్స్) అత్యంత అనుకూలమైన టాప్-10 నగరాల జాబితాలో ముంబై స్థానం దక్కించుకుంది. అంతర్జాతీయ స్థిరాస్తి సేవల సంస్థ కొలియర్స్ విడుదల చేసిన '2027 గ్లోబల్ ఇన్వెస్టర్ ఔట్‌లుక్' నివేదికలో ఈ కీలక వివరాలు వెల్లడయ్యాయి. మౌలిక సదుపాయాల విస్తరణ, పెరుగుతున్న ఆఫీస్ స్పేస్ డిమాండ్, అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన గ్రేడ్-ఏ ఆస్తులు అందుబాటులో ఉండటం ముంబైకి కలిసొచ్చిందని నివేదిక స్పష్టం చేసింది. ముంబై ట్రాన్స్ హార్బర్ లింక్, నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం వంటి మెగా ప్రాజెక్టులు ప్రాంతీయ రవాణాను వేగవంతం చేస్తూ రియల్టీ వృద్ధికి బాటలు వేస్తున్నాయని కొలియర్స్ ఇండియా సీఈవో బాదల్ యాజ్ఞిక్ తెలిపారు. భారత్‌లో దీర్ఘకాలిక పెట్టుబడులపై గ్లోబల్ ఇన్వెస్టర్లకు నమ్మకం గణనీయంగా పెరిగిందని పేర్కొన్నారు. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో టోక్యో అగ్రస్థానంలో నిలవగా.. ఒసాకా, సిడ్నీ రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. వీటితో పాటు మెల్‌బోర్న్, సింగపూర్, బ్రిస్బేన్, సపోరో, సియోల్ వంటి నగరాలు టాప్ జాబితాలో నిలిచాయి. భారత్‌లో ముంబైతో పాటు హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీ-ఎన్‌సీఆర్, పుణె నగరాల్లోని గ్రేడ్-ఏ ఆఫీస్ స్పేస్‌లకు గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీ) నుంచి భారీ డిమాండ్ నెలకొంది. 2026 మొదటి తొమ్మిది నెలల్లో దేశవ్యాప్తంగా జరిగిన మొత్తం రియల్టీ పెట్టుబడుల్లో ఆఫీస్ స్పేస్ వాటా ఏకంగా 37 శాతంగా నమోదైంది. కేవలం ఆఫీసులు మాత్రమే కాకుండా డేటా సెంటర్లు, లాజిస్టిక్స్, హాస్పిటాలిటీ వంటి ప్రత్యామ్నాయ రంగాల్లోనూ పెట్టుబడులు భారీగా పెరిగాయి. ముఖ్యంగా 2025 ఇదే కాలంతో పోలిస్తే హాస్పిటాలిటీ, ఆల్టర్నేటివ్ అసెట్స్‌లో ఇన్వెస్ట్‌మెంట్లు ఆరు నుంచి ఏడు రెట్లు పెరగడం దేశీయ రియల్ ఎస్టేట్ రంగానికి కొండంత బలాన్నిస్తోంది.



HEAD OFFICE FLAT NO 101 2ND FLOOR SADGURU APTS BEHIND BAZAR THARANKA SEC BAD 500017,
HYDERABAD TELANGANA STATE OFFICE
PHONE NAMBER 9603437744, 7729045143,9441015254,7893948284 EMAIL : JAIBHEEMTVINDIA@GMAIL. COM, WEBSITE: WWW.JAIBHEEM,TV.COM